
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
కృష్ణా జిల్లా వార్తలు
మంగళవారం 16 సెప్టెంబరు 2025





జేసీ బదిలీ



గీతాంజలిశర్మ

మచిలీపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జాయింట్ కలెక్టర్ (జేసీ) గీతాంజలిశర్మ బదిలీ అయ్యారు. డిస్పోజల్ ఆఫ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ విభాగం మేనేజింగ్ డైరెక్టర్‌గా ఆమెను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆమె 2024, జనవరి 5 నుంచి కృష్ణాజిల్లా జేసీగా పనిచేస్తున్నారు. ఆమె స్థానంలో జేసీగా ఇంకా ఎవరినీ నియమించలేదు.

ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న వి.విద్యాసాగర్ నాయుడు



కొత్త ఎస్పీగా విద్యాసాగర్

- బాధ్యతల స్వీకరణ


మచిలీపట్నం క్రైమ్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తప్పు చేసినవారు ఎటువంటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని కొత్త ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా అన్నమయ్య జిల్లా నుంచి వచ్చిన ఆయన సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. పోలీసు సిబ్బంది గౌరవ వందనాన్ని అందుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ శాంతిభద్రతల పర్యవేక్షణ, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక దృష్టిసారిస్తానన్నారు. మహిళలకు మిగతా 6లో..

వ్యవసాయం

రైతులకు రాయితీతో అధునాతన పరికరాలు

సాల్ట్ భూముల పరిరక్షణకు ముందడుగు

- మచిలీపట్నంలో 122 డ్రెయిన్లకు నిధులు
- కలెక్టర్ బాలాజీకి సీఎం చంద్రబాబు అభయం
- అమరావతిలోని కలెక్టర్ల సమావేశంలో హామీలు
- జీడీడీపీలో ఎన్టీఆర్ జిల్లాకు 9, కృష్ణాజిల్లాకు 15వ స్థానం
- వ్యవసాయానుబంధ రంగాల్లో దుమ్మురేపిన జిల్లా
- జిల్లాలు, మండలాలవారీగా స్కోర్ల ప్రకటన





అమరావతిలో జరిగిన కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న కలెక్టర్ బాలాజీ

రైతులందరికీ అధునాతన పరికరాలు.. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన అంశాలు.. మచిలీపట్నంలో డ్రెయిన్ల మరమ్మతులు.. జిల్లా స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీడీపీ)లో లక్ష్యాలు.. స్వర్ణాంధ్ర సాధన.. జిల్లాలు, మండలాలవారీగా కేపీఐ స్కోర్ల ప్రకటన.. వ్యవసాయానుబంధ రంగాల్లో పురోగతి.. అమరావతిలోని సచివాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ బాలాజీకి సీఎం చంద్రబాబు సూచించిన అంశాలివి. జిల్లాలోని సమస్యలను సుదీర్ఘంగా విన్న సీఎం వాటి పరిష్కారానికి సూచనలు చేయడంతో పాటు జిల్లా పురోభివృద్ధి సూచికను వివరించారు.

మచిలీపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉద్యాన పంటలు సాగుచేసే రైతులకు అధునాతన పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు తగిన తోడ్పాటు ఇవ్వాలని కలెక్టర్ బాలాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. రాజధాని అమరావతిలోని సచివాలయం ఐదో బ్లాక్‌లో సోమవారం జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ బాలాజీ జిల్లాకు సంబంధించిన పలు అంశాలను సీఎంకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ పథకాల ద్వారా పంటకోత తరువాత నిర్వహణ కోసం రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు మాత్రమే 75 శాతం రాయితీతో సోలార్ డ్రయ్యర్లు, రిఫ్రిజిరేటర్లతో కూడిన వాహనాలను, ఇతర ఉపకరణాలను ఇస్తున్నారన్నారు. ఈ పథకాల ద్వారా రైతులందరికీ పరికరాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. జిల్లాల్లో 6 వేల ఎకరాల సాల్ట్ భూములు ఉన్నాయని, ఈ భూములు కోర్టు కేసుల్లో ఉన్నాయని కలెక్టర్ ముఖ్యమంత్రికి తెలిపారు. 1967లో ఈ భూములను అటవీ శాఖ నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, అయినప్పటికీ అటవీ శాఖ, మిగతా 6లో..

జీడీడీపీలో ఇలా..

స్థూల జిల్లా దేశీయ ఉత్పత్తి (జీడీడీపీ)లో ఎన్టీఆర్ జిల్లా రాష్ట్రంలో తొమ్మిదో స్థానంలో నిలిచింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎన్టీఆర్ జిల్లాకు రూ.1,12,057 కోట్ల జీడీడీపీ (18.50%) నిర్దేశించగా, మొదటి క్వార్టర్‌లో రూ.21,988 కోట్ల (19.62%) జీడీడీపీ సాధించింది. మిగిలిన మూడు క్వార్టర్లకు కలిపి రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన టార్గెట్ రూ.90,069 కోట్ల (80.38%) ఆదాయాన్ని సాధించాల్సి ఉంది. కృష్ణాజిల్లా 15వ స్థానంలో నిలిచింది. ఆర్థిక సంవత్సరానికి రూ.1,02,521 కోట్ల (16.84%) జీడీడీపీ లక్ష్యం నిర్దేశించగా, మొదటి క్వార్టర్‌లో రూ.19,196 కోట్లు (18.72%) సాధించింది. మిగిలిన మూడు క్వార్టర్లకు సంబంధించి రూ.83,324 కోట్ల (81.28%) జీడీడీపీ సాధించాల్సి ఉంది.



ఆయుధాలే ఆభరణాలు

దుర్గమ్మకు త్రిమూర్తులు సహ ఇంద్రాది దేవతల బహూకరణ

- వాటితోనే దుష్టరాక్షస సంహారం
- ఒక్కో ఆయుధానికి ఒక్కో విశిష్టత
- త్రిశూలం, సుదర్శనం, ఖడ్గం, బాణం, విల్లు, గధ, వజ్రాయుధం, దివ్యశంఖం, దివ్యాస్త్రం, గొడ్డలి, కమలానికి ఎన్నో పురాణగాథలు

నేడు పోరంకికి సీఎం చంద్రబాబు

ఎన్టీఆర్ ప్రజాస్వామ్య పరిరక్షణోద్యమం 'సజీవ చరిత్ర' పుస్తకావిష్కరణ

పెనమలూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : 1984లో కేంద్ర ప్రభుత్వం కుట్రతో ఎన్టీఆర్‌ను పదవీచ్యుతుడ్ని చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం, ఆ తర్వాత ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడిన ఎన్టీఆర్ స్ఫూర్తితో రాష్ట్రంలో, దేశంలో జరిగిన అనేక మార్పులపై విక్రం పూల బృందం రచించిన 'సజీవ చరిత్ర' పుస్తకావిష్కరణ మంగళవారం సాయంత్రం 5 గంటలకు పోరంకి మురళీ రిసార్ట్స్‌లో జరుగుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్ టీడీ జనార్ధన్, నందమూరి రామకృష్ణ హాజరవుతారు.

1,198 టీచర్ పోస్టుల భర్తీ

ఉమ్మడి కృష్ణాజిల్లాలో డీఎస్సీ అభ్యర్థుల జాబితా విడుదల

- 1,208 పోస్టులకు గానూ 1,198 పోస్టులకు ఓకే
- మిగతా 10 పోస్టులకు అనర్హత.. భర్తీ నిలిపివేత
- 19న పోస్టింగ్ ఉత్తర్వులు అందజేత
- మచిలీపట్నం డీఈవో కార్యాలయంలో జాబితా ప్రదర్శన
- ఎక్కడికక్కడ హెల్ప్‌డెస్కుల ఏర్పాటు : డీఈవో

ఉమ్మడి జిల్లాలో డీఎస్సీ-2025కు సంబంధించి 1,198 టీచర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల తుది జాబితాను ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ఈ మేరకు ఈనెల 19న ఎంపికైన టీచర్లకు నియామక ఉత్తర్వులు అందజేయనున్నారు. మచిలీపట్నంలోని డీఈవో కార్యాలయం నోటీసు బోర్డులో ఈ జాబితాను అందుబాటులో ఉంచారు.



ఈనెల 19న అమరావతిలో డీఎస్సీ అభ్యర్థులకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేసే కార్యక్రమానికి ముస్తాబవుతున్న వేదిక

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఉమ్మడి కృష్ణాజిల్లాలో 1,208 టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు ఏప్రిల్ 25న ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో టీచర్ పోస్టుల కోసం 67,470 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. ఆగస్టు 12న మార్కులను, ఈ తరువాత ర్యాంకులను విడుదల చేశారు. సర్టిఫికెట్లను పరిశీలించాక 1,198 పోస్టులను భర్తీ చేసేందుకు తుది జాబితాను ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో 10 టీచర్ పోస్టులకు సంబంధించి అభ్యర్థులు అర్హత సాధించకపోవడంతో భర్తీని నిలిపివేశారు. ఎంపికైన అభ్యర్థులకు సంబంధించిన జాబితాను సోమవారం డీఈవో కార్యాలయం నోటీసు బోర్డులో ఉంచారు. దీంతోపాటు డీఎస్సీ-2025 వెబ్‌సైట్‌లో మిగతా 6లో..

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో..

విజయవాడ, మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని పాఠశాలల్లో ఎస్ఏ తెలుగులో ఒక పోస్టు, ఎస్ఏ ఇంగ్లీష్‌లో 3, ఎస్ఏ మేథమెటిక్స్‌లో 3, ఎస్ఏ బయలాజికల్ సైన్స్‌లో 3, ఎస్ఏ సోషల్ స్టడీస్‌లో 2, ఎస్ఏ సోషల్ స్టడీస్ ఉర్దూ విభాగంలో ఒక పోస్టును భర్తీ చేయనున్నారు. ఎస్‌జీటీ విభాగంలో 58 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఎస్‌జీటీ ఉర్దూ విభాగంలో 10 పోస్టులు ఉండగా, ఏడుగురే అర్హత సాధించారు. మిగిలిన మూడు పోస్టులకు అభ్యర్థులు అర్హత సాధించకపోవడంతో నిలిపివేశారు.

చిల్లర పనులు

దుర్గగుడి కేశఖండన శాలలో దోపిడీ

- టికెట్ రూ.40 అయితే, రూ.50 వసూలు
- మిగతా రూ.10 సిబ్బంది జేబుల్లోకి..
- ప్రశ్నించిన భక్తులకు చిల్లర లేదని సమాధానం
- తలనీలాల అనంతరం మరో రూ.50 వసూలు



ఉత్తరాంధ్ర నుంచి ఓ భక్తుడు ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చాడు. ముందుగా అమ్మవారికి తలనీలాలు సమర్పించాక దర్శనానికి వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. కేశఖండన శాల కౌంటర్‌లోకి వెళ్లి టికెట్ తీసుకోవడానికి రూ.100 ఇచ్చాడు. కౌంటర్‌లోని సిబ్బంది టికెట్‌తో పాటు తిరిగి రూ.50 చేతిలో పెట్టారు. టికెట్ రూ.40 కదా.. ఇంకా తనకు పది రూపాయలు వస్తాయని భక్తుడు అడిగాడు. తమ వద్ద చిల్లర లేదని కౌంటర్‌లోని సిబ్బంది సమాధానం చెప్పి ఆ భక్తుడిని పంపేశారు.

తెలంగాణాకు చెందిన ఓ భక్తుడు కుటుంబంతో కలిసి ఇంద్రకీలాద్రి వచ్చాడు. అమ్మవారికి తలనీలాలు ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు. కేశఖండన శాలలోకి వెళ్లి కౌంటర్‌లో ఉన్న సిబ్బందికి రూ.50 ఇచ్చాడు. దేవస్థానం నిర్ణయించిన టికెట్ ధర రూ.40. టికెట్‌తో పాటు రూ.10 తిరిగి ఇవ్వాల్సిన సిబ్బంది ఆ పని చేయలేదు. టికెట్ మాత్రమే చేతిలో పెట్టారు. పది రూపాయలు వస్తుందని భక్తుడు అడిగితే చిల్లర లేదని చెప్పి పంపేశారు.

ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న భక్తుల నుంచి సిబ్బంది ఎలా డబ్బు దండుకుంటున్నారో తెలియజేసే ఘటనలివి. ఇంద్రకీలాద్రిని కొంతమంది దళారులు, ఉద్యోగులు ఆదాయ వనరుగా మార్చేసుకుంటున్నారు. చిల్లర లేదు.. అన్న ఒక్కమాటతో కేశఖండన శాలలో భక్తుల నోళ్లను మూయించేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఇంద్రకీలాద్రికి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. ముందుగా కేశఖండన శాలలోకి వెళ్లి తలనీలాలు సమర్పిస్తారు. తర్వాత దుర్గాఘాట్‌లో స్నానంచేసి దర్శనానికి వెళ్తారు. సాధారణ రోజుల్లో 25 వేల నుంచి 30 వేల మంది భక్తులు వివిధ మిగతా 6లో..

ఆక్రమిత భూములకు విముక్తి

గన్నవరంలోని ప్రభుత్వ భూముల పరిరక్షణకు కమిటీల ఏర్పాటు

- గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు, విజయవాడ మండలాల పరిధిలో..
- వైసీపీ హయాంలోని ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి
- ఎమ్మెల్యే యార్లగడ్డ చొరవతో కమిటీ ఏర్పాటుచేసిన ఇరు జిల్లాల కలెక్టర్లు
- క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం సమగ్ర నివేదిక



విజయవాడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో గన్నవరం నియోజకవర్గంలో అక్రమార్కులు చెరపట్టిన ప్రభుత్వ భూములకు విముక్తి కలగనుంది. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండలాల పరిధిలో కోట్ల విలువచేసే ప్రభుత్వ భూములను కొట్టేసిన వారి నుంచి తిరిగి స్వాధీనం మిగతా 6లో..

మార్పు మంచిదే..



విజయవాడ రైల్వేస్టేషన్‌ను మరో ప్రాంతానికి మారిస్తే ఎలా ఉంటుంది? దక్షిణ కోస్తా రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సీఆర్ఎంయూ) అగ్రనాయకత్వం మాత్రం మారిస్తేనే బాగుంటుందని సూచిస్తోంది. బెజవాడ ఏ1 రైల్వేస్టేషన్‌ను అజిత్‌సింగ్‌నగర్‌కు రీలొకేషన్ చేయాలనే ప్రతిపాదనను తీసుకొచ్చింది. ట్రాఫిక్ కష్టాల నేపథ్యంలో దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఆవిర్భవించాక విజయవాడ డివిజన్ ముఖచిత్రం ఎలా ఉండాలన్న దానిపై ఎస్‌సీఆర్ఎంయూ అధ్యయనం చేసి, రైల్వే డివిజనల్, జోనల్ ఉన్నతాధికారులతో పాటు రైల్వేబోర్డుకు ఈ మేరకు ప్రతిపాదించడానికి సిద్ధమవుతోంది.

బెజవాడ రైల్వేస్టేషన్‌ను సింగ్‌నగర్‌కు రీలొకేషన్ చేయాలని ప్రతిపాదన

సింగ్‌నగర్‌లో కొత్త స్టేషన్ ఏర్పాటు చేయాలని హితవు

- ఎస్‌సీఆర్ఎంయూ కొత్త అధ్యయనంలో సూచనలు
- త్వరలో రైల్వే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ రైల్వే స్టేషన్‌ను అజిత్‌సింగ్‌నగర్‌లో ఏర్పాటు చేయటం ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయని దక్షిణ కోస్తా రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సీఆర్ఎంయూ) సూచిస్తోంది. గతంలో సత్యనారాయణపురం రైల్వేలైన్‌ను తొలగించి బీఆర్‌టీఎస్ రోడ్డును నిర్మించినందుకు రైల్వేకు ప్రభుత్వం సింగ్‌నగర్‌లో 25 ఎకరాలు ఇచ్చింది. ఈ భూములను తిరిగి ప్రభుత్వానికి సరండర్ చేసి.. సింగ్‌నగర్‌లోనే మెయిన్ లైన్ వెంబడి సువిశాల రైల్వేస్టేషన్ కోసం మిగతా 6లో..

వన్‌టౌన్, టూటౌన్‌కు వెసులుబాటు

నగరంలో వన్‌టౌన్, టూటౌన్‌కు ప్రస్తుత విజయవాడ రైల్వేస్టేషన్ అడ్డుగోడగా ఉంది. రైల్వేస్టేషన్‌ను రీ లొకేట్ చేయటంతో పాటు ఎలివేటెడ్ కారిడార్ల వల్ల వన్‌టౌన్, టూటౌన్ ప్రాంతాలు అనుసంధానమవుతాయి. మధ్యలో అనేక మార్గాలు ఏర్పడతాయి. దీనివల్ల బందరు రోడ్డు, ఏలూరు రోడ్డు, లోబ్రిడ్జి, కాళేశ్వరరావు మార్కెట్ వైపు ట్రాఫిక్ తగ్గుతుంది.

13 మందికి ఎండీవోలుగా పదోన్నతి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఖాళీగా ఉన్న 13 ఎండీవో పోస్టులను పదోన్నతులతో భర్తీ చేశారు. ఏవోలుగా పనిచేస్తున్న నలుగురికి పదోన్నతులు కల్పించగా, ఈవోఆర్డీలుగా పనిచేస్తున్న తొమ్మిది మందికి పదోన్నతులు మిగతా 6లో..

శక్తి స్వరూపిణి





మహిషాసుర సంహారం అనంతరం విజయవాడ కనకదుర్గమ్మ స్వయంభువుగా కొండపైకి వచ్చారని పురాణ కథనం.. కీలుడనే యక్షుడు తపస్సుచేసి నిత్యం తన భుజాలపై అమ్మవారు ఉండేలాగా వరం పొందాడు. ఆ తరువాత కీలుడు కొండగా మారాడు. ఇక్కడ కొలువైన అమ్మవారికి ఇంద్రాది దేవతలు పరిపరివిధాలుగా కీర్తించి ఆమెను పూజించారు. దీంతో ఇంద్ర కీలం పేరు స్థిరమైంది. యక్షుడికి ఇచ్చిన వరం మేరకు ఇంద్రకీలాద్రిపై అమ్మవారు భక్తులకు కోటి సూర్యకాంతులతో దర్శనమిస్తూ పూజలందుకుంటున్నారు.

(ఆంధ్రజ్యోతి, ఇంద్రకీలాద్రి)

మహిషాసుర సంహారం అనంతరం ఉగ్రరూపంలో ఉన్న కనకదుర్గమ్మకు తొలినాళ్లలో వామాచార విధానంలో అర్చనలు చేసేవారు. వామాచారం అంటే జంతుబలులు, తదితరాలతో దుర్గమ్మకు నైవేద్యాలు పెట్టి కొలిచేవారు. వేల సంవత్సరాల నుంచి అక్కడ కొలువై ఉన్న దుర్గమ్మవారిని కాలక్రమేణా 8వ శతాబ్ధంలో కాలినడకన వచ్చిన ఆది శంకరాచార్యులవారు దర్శించుకుని ఆమె ఉగ్రరూపాన్ని చూసి దివ్యాభరణ భూషిత అయిన లలిత మనోహర సుందరమూర్తిగా దర్శనమివ్వాలని కోరగా.. అమ్మవారి అనుమతితో ఉగ్ర రూపాన్ని తీసివేసి, ఆమెకు సకల జన మనోహర



హృదయరంజిత సుశోభిత రూపం కల్పించారు. అప్పటి నుంచి ఆమెకు ఆభరణాలు ధరింపజేయటం, అలంకారాలు చేయటం జరుగుతున్నాయి.

● శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాత్యాయినీ, కాలరాత్రి, భైరవి, సిద్ధిధాత్రి అనే నవదుర్గల రూపాలు అంతరంగా ఉన్నప్పటికీ, దసరా మహోత్సవాలలో స్వర్ణకవచ అలంకృత దుర్గగా, బాల త్రిపుర సుందరిగా, లలితా త్రిపుర సుందరిగా, గాయత్రిగా, అన్నపూర్ణగా, మహాలక్ష్మిగా, సరస్వతిగా, మహిషాసుర మర్ధినిగా, రాజరాజేశ్వరిగా అలంకరిస్తారు. నవరాత్రుల్లో అలంకారాలను బట్టి అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలను ధరింపజేస్తారు.

● ముఖ్యంగా అమ్మవారి చేతులలో ఉండే ఆయుధాలను పురాణాల ప్రకారం ఆభరణాలుగా భావిస్తారు. ఇక అలంకారం నిమిత్తం నవరత్నాలు పొదిగిన వివిధ రకాల హారాలు, ముక్కుపుడక, చెవిదిద్దులు, బంగారు గాజులు, కిరీటం, వడ్డాణం వంటివి ధరింపజేస్తారు. అలంకారాల విశేషతలను బట్టి వాహనాలు, ఆసనాలు తదితరాలను ఏర్పాటు చేస్తారు. సరస్వతీదేవికి నెమలి వాహనం, వీణ వంటివి ధరింపజేస్తారు. అన్నపూర్ణాదేవికి శివుడు భిక్షాటన చేస్తున్నట్టు, అమ్మవారు పాయాసాన్ని వడ్డిస్తున్నట్టు ఆవిష్కరింపజేస్తారు. మహిషాసుర మర్ధినిగా మహిషవాహనంపై మహిషుడిని సంహరిస్తున్నట్టుగా ఆవిష్కరింపజేస్తారు.

● ఒక్కో అలంకారానికి ఒక్కో విశిష్టత ఉంది. స్వర్ణ కవచ అలంకృత దుర్గాదేవిని దర్శించుకున్నట్టయితే ఆమె ధరించిన స్వర్ణ కవచం నుంచి వెలువడే కాంతులు భక్తులపై పడటంతో వారికి కూడా శత్రు భయం ఉండదని, భూత, పిశాచాది బాధలు తొలగిపోతాయని.. సరస్వతీదేవి అలంకారాన్ని దర్శించుకుంటే జ్ఞానం కలుగుతుందని భక్తుల నమ్మిక. రాజరాజేశ్వరి అలంకారానికి ప్రత్యేకత ఉంది. ఆమెకు చిద్రూపి, పరదేవతా అని పేరు. శాంతమూర్తి. భక్తులకు శాంతి సుఖాలను కలుగజేస్తు అభయమిస్తున్నట్టుగా చెరకు గడను, కమల పుష్పాన్ని ధరించి ఉంటుంది. ఆమె శ్రీచక్ర సంచారిణి. శ్రీమాతా, శ్రీమహారాజ్ఞిగా లోకాలన్నింటికీ తల్లిగా భావించి భక్తులు ఆమెను కొలుస్తారు. నవరాత్రులు అంటేనే చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా భావిస్తారు. అత్యంత వైభవంగా పదిరోజుల పాటు దసరా మహోత్సవాలు జరుగుతుంటాయి. ఈసారి తిదుల హెచ్చుల తగ్గుల కారణంగా కనకదుర్గగుడిలో 11 రోజుల పాటు దసరా ఉత్సవాలు జరగనున్నాయి.

● అమ్మవారి కిరిటానికి అటుపక్క, ఇటుపక్క సూర్య, చంద్రుల ఆభరణాలు ఉంటాయి. వివిధ రకాల హారాలు చంద్రహారం, నవరత్నాలు పొదిగిన హారం, పచ్చలు పొదిగిన హారం, ముత్యాల హారం ఇలా ఎన్నోరకాల హారాలను ధరింపజేస్తారు. అమ్మవారికి వడ్డాణం, చేతి కడియాలు, అరవంకీలు, తదితరాలు ఆయా అలంకారాలను బట్టి ధరింపజేస్తూ ఉంటారు. ఏరోజుకారోజే ఆభరణాలను మార్చి అలంకారం చేస్తుంటారు. భక్తులు వారి మొక్కులు తీర్చుకునే సందర్భంలో వివిధ రకాల ఆభరణాలను కానుకగా అందచేస్తారు. ఈ ఆభరణాలనే అమ్మవారికి విశేషంగా అలంకరిస్తారు.

ఆయుధాలే ఆభరణాలుగా కనకదుర్గమ్మ

దుష్టరాక్షస సంహారం కోసం అమ్మవారు ప్రత్యేకంగా అవతరించారు. ఆ సమయంలో ఆమెకు సకల శక్తులు సమకూర్చటం కోసం బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, ఇంద్రాది దేవతలు ఆమెకు ఆయుధాలను అందజేస్తారు. ఆ ఆయుధాలకు అన్నింటికీ ఒక్కో ప్రత్యేకత ఉంది. దాంతో ఆమె శక్తిస్వరూపిణి అయ్యింది. ఆమె మహిషాసురుడిని త్రిశూలంతో సంహరిస్తుంది. త్రిశూలం అతిముఖ్యమైన ఆయుధంగా ఆమె కుడిచేతికి దివ్య ఆభరణంగా ఉంటుంది. శివుడు ఆమెకు త్రిశూలం కానుకగా ఇచ్చాడు. సృష్టి, స్థితి లయకారిణిగా ఉండటమే ఈ త్రిశూల ఆయుధ నేపథ్యం. సుదర్శన చక్రం మహావిష్ణువు ఆమెకు అందజేశారు. ఈ సుదర్శనచక్రం ఎందరో రాక్షసులను సంహరించింది. సుదర్శన చక్రానికి ఎదురేలేదని చెబుతారు. సుదర్శన చక్ర దర్శనంతో భక్తులకు సర్వరోగ ప్రశమనం కలుగుతుందని, శత్రుభీతి ఉండదని నమ్మిక. అమ్మవారు తనకు కాపలాగా ఉండేందుకు ఒక ప్రతిమను చేసి ప్రాణప్రతిష్ట చేసి గుమ్మం దగ్గర పెట్టిన సమయంలో శివుడు రావటం ఆయనను అడ్డుకోవటంతో ఆ ప్రతిమను సంహరించటం, ఆ తరువాత జరిగిన పరిణామంలో ఏనుగు తలను తీసుకువచ్చి ఆ ప్రతిమకు పెట్టి, వినాయకుడి పేరు పెట్టటం జరుగుతుంది. ఆ వినాయకుడే తన తల్లికి కానుకగా ఖడ్గంను కానుకగా ఇచ్చాడు. ఈ ఖడ్గాన్ని విశిష్టమైనదిగా భావిస్తారు. వాయుదేవుడు బాణాన్ని, విల్లును ఇచ్చాడని ప్రతీతి. యమధర్మరాజు గధను ఇచ్చాడని, ఇంద్రుడు వజ్రాయుధాన్ని ఇచ్చాడని, వరుణుడు దివ్య శంఖాన్ని ఇచ్చాడని, అగ్నిదేవుడు శక్తి అనే దివ్యాస్త్రాన్ని ఇచ్చాడని, విశ్వకర్మ గొడ్డలి ఇచ్చాడని, బ్రహ్మదేవుడు కమలాన్ని ఇచ్చాడని పురాణగాథలు.

దసరా ఉత్సవ మొబైల్ యాప్ ఆవిష్కరణ



దసరా ఉత్సవ మొబైల్ యాప్, చాట్‌బాట్‌లను ఆవిష్కరిస్తున్న దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్, ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : దసరా ఉత్సవాలు-2025 సందర్భంగా భక్తులకు మార్గదర్శకత్వం చేసే దసరా ఉత్సవ మొబైల్ యాప్, చాట్ బాట్‌లను దేవదాయ కమిషనర్ కె.రామచంద్రమోహన్, ఈవో వి.కె.శీనానాయక్‌లు ఆవిష్కరించారు. అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్స్ సంస్థ రూపొందించిన ఈ సాంకేతిక సదుపాయాలు భక్తులకు ఉపయోగపడతాయని కమిషనర్ ఆకాంక్షించారు. ప్లే స్టోర్, యాప్ స్టోర్‌లో దసరా-2025 పేరుతో యాప్, 9441820717 నెంబర్‌తో చాట్ బాట్ అందుబాటులో ఉందని, అమ్మ అని మెసేజ్ సెండ్ చేస్తే సమాచారం వస్తుందని తెలిపారు. యాప్‌లో ఒకే ప్లాట్‌ఫారంలో సింగిల్ విండో డిజిటల్ సొల్యూషన్‌ను అనుసంధానం చేశారు. ఐకాన్ వారీగా చూస్తే దర్శన సమయాలు, అమ్మవారికి దసరా ఉత్సవాలలో నిర్వహించే అలంకారాలు, సేవ బుకింగ్, క్యూఆర్ ఆధారిత సేవా నమోదు, దేశ, విదేశాల భక్తులు ఉత్సవాలను ఎక్కడనుంచైనా వీక్షించేందుకు ప్రత్యక్ష ప్రసారాలు, ప్రసాదాల విక్రయాల కౌంటర్లు, ప్రసాదం అందుబాటు, కౌంటర్ లోకేషన్, క్యూ ఎంతపొడవు ఉన్నదన్న వివరాలు కూడా ఈ యాప్‌లో తెలిసేందుకు అవకాశం ఉంది. దేవస్థానం బస్సుల ట్రాకింగ్, పార్కింగ్ కోసం స్లాట్‌లు, మ్యాప్ నేవిగేషన్, ప్రథమ చికిత్స, పోలీస్, ఫైర్, ఆసుపత్రిల కాంట్రాక్ట్‌లు, మరుగుదొడ్ల లోకేషన్, మంచినీటి సౌకర్యాలు, చిన్నారుల భద్రత, ఆలయ సమాచారం, చరిత్ర, ప్రత్యేక ఈవెంట్లు, దాతలు, వలంటీర్లకు సంబంధించిన డ్యూటీ వివరాలు, ప్రత్యేక సౌకర్యాలు వంటివి ఉంటాయి. అభిప్రాయాలు తెలియజేసేందుకు, ఫిర్యాదులు చేసేందుకు ఫీడ్ బ్యాక్ వంటి సదుపాయాలు ఈ యాప్‌లో ఉన్నాయి. రియల్ టైమ్ అలెర్ట్‌లు, అత్యవసర ప్రకటనలు ఉన్నాయి. చాట్ బాట్‌ను అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్స్ ప్రవేట్ లిమిటెడ్, దుర్గగుడి ఐటీ విభాగం కలిసి రూపొందించారు.చాట్ బాట్ భక్తులకు సురక్షితమైన సౌకర్యవంతమైన పారదర్శక దర్శనం అందించే ప్రధాన డిజిటల్ సాధనమని దుర్గగుడి అధికారులు పేర్కొన్నారు.



దసరా ఏర్పాట్లను ఈవో శీనానాయక్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలిస్తున్న దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్

దసరా ఏర్పాట్లకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇవ్వండి

» దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : దసరా ఏర్పాట్లపై 48 గంటల్లోగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇవ్వాలని.. ప్రతిష్టాత్మకంగా జరుగబోయే దసరా ఉత్సవాలకు అన్నివిధాల అధికారులు సన్నద్ధం కావాలని, భక్తుల సౌకర్యాల విషయంలో ఏకాభిప్రాయం కలిగి ఉండాలని దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ అన్నారు. దసరా శరన్నవరాత్రుల ఏర్పాట్లను ఈవో శీనానాయక్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. కనకదుర్గానగర్, కొత్త లడ్డూపోటు, అన్నదాన భవనం తదితరాలను అధికారులతో కలిసి పరిశీలించి, పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రామచంద్రమోహన్ మాట్లాడుతూ, దేవస్థానం ఆవరణలో జరుగుతున్న పనుల్లో 80 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను అదనపు కార్యనిర్వాహక ఇంజనీర్ల సహకారంతో 48 గంటల్లోగా పూర్తిచేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను సమర్పించాలని, నిర్దేశించిన సమయంలోగా మిగిలిన పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.



శిక్షణార్థులతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఉపాధి శిక్షణతో పేదరిక నిర్మూలన

» మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఉంగుటూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పేదరిక నిర్మూలనలో భాగంగా యువతకు స్వయం ఉపాధి శిక్షణ చాలా ముఖ్యమని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. సోమవారం ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్(విజయవాడ చాప్టర్)లో పలు స్వయంఉపాధి కోర్సుల్లో శిక్షణ పొందుతున్న యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేవలం ప్రభుత్వం మాత్రమే అన్నీ చేయలేదని, ప్రభుత్వంతోపాటు ప్రైవేటుసంస్థలు, వ్యక్తులు కలిసి భాగస్వామ్యంతో పనిచేస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈనేపథ్యంలో నైపుణ్యాభివృద్ధి(స్కిల్ డెవలప్‌మెంట్), నైపుణ్య శిక్షణ ప్రజా ఉద్యమంగా మారాలని సూచించారు. యువతరం ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలన్న ఆయన శారీరక, మానసిక ఆరోగ్యం కోసం ప్రతిరోజూ వ్యాయామం, యోగా చేయాలని, అది ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్యాపిటల్‌లో అరుదైన శస్త్రచికిత్స



వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

పెనమలూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తీవ్ర కాలేయ వ్యాధితో బాధపడుతున్న 40ఏళ్ల వ్యక్తికి తొలిసారిగా హైరిస్క్ 'రీడో హార్ట్ సర్జరీ' నిర్వహించినట్టు పోరంకి క్యాపిటల్ ఆసుపత్రి వైద్యులు పేర్కొన్నారు. ఆసుపత్రి ఎండీ డాక్టర్ మన్నె హరీష్ తెలిపిన వివరాల ప్రకారం.. టంగుటూరుకు చెందిన జాడా మదన్ 2008లో ఏవీఆర్, 2020లో బెలూన్ మిట్రల్ వాల్వోటమీ చికిత్సలు చేయించుకున్నాడు. కేసును అనేక ప్రముఖ కేంద్రాలు తీవ్ర రిస్క్ ప్రొఫైల్ కారణంగా తిరస్కరించాయి. చివరి ప్రయత్నంగా రోగి తమను సంప్రదించగా అయోర్టిక్ వాల్వ్, తీవ్రమైన మిట్రల్ స్టెనోసిస్, ఇతర ఇబ్బందులున్నాయని గుర్తించామని, అతడికి అప్పటికే బైలిరూబిన్ స్థాయిలో కాలేయ వైఫల్యం ప్రారంభమై పరిస్థితి మరింత దిగజారిందన్నారు. దీంతో ఇక్కడి వైద్య బృందం శస్త్ర చికిత్స ఒక్కటే మార్గమని అతడి బంధువులకు తెలియజేయగా వారి సమ్మతితో అత్యంత నైపుణ్యం కలిగిన మల్టీడిసిప్లినరీ బృందంతో శస్త్ర చికిత్స చేశామన్నారు. డాక్టర్ శ్రీధర్, డాక్టర్ భూపాల్, డాక్టర్ ఎం.గిరీష్, సపోర్టర్లు విజయవంతంగా సర్జరీ నిర్వహించారన్నారు. శస్త్రచికిత్సకు ముందు శ్వాస తీసుకోవడానికే ఇబ్బంది పడ్డ రోగి త్వరగా కోలుకొని డిశ్చార్జి అయ్యారని తెలిపారు. ఇంత క్లిష్టమైన కార్డియాక్ సర్జరీ చాలా అరుదైన ఘటన అని డాక్టర్ హరీష్ తెలిపారు.

1,198 టీచర్ పోస్టుల భర్తీ

(5వ పేజీ తరువాయి)

ఈ వివరాలు ఉన్నాయి.

సబ్జెక్టులవారీగా పోస్టుల వివరాలు

జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లో ఆయా సబ్జెక్టుల్లో భర్తీకానున్న పోస్టుల వివరాలు ఇలా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ) తెలుగు సబ్జెక్టులో 29 పోస్టులకు 29 మంది ఎంపిక య్యారు. ఎస్‌ఏ ఉర్దూ విభాగంలో 4 పోస్టులకు మూడింటికే అభ్యర్థులను ఎంపిక చేశారు. ఒక పోస్టుకు ఎవరూ అర్హత సాధించకపోవడంతో భర్తీ నిలిపివేశారు. ఎస్‌ఏ సంస్కృతం విభాగంలో రెండు పోస్టులకు ఒక పోస్టే భర్తీ చేశారు. మరో పోస్టుకు అభ్యర్థులు అర్హత సాధించకపోవడంతో నిలిపివేశారు. ఎస్‌ఏ హిందీ విభాగంలో 23 పోస్టులు, ఎస్‌ఏ ఇంగ్లీష్ విభాగంలో 88 పోస్టులు, ఎస్‌ఏ మేథమెటిక్స్ విభాగంలో 48 పోస్టులు, ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్ విభాగంలో 53 పోస్టులు, ఎస్‌ఏ బయోలాజికల్ సైన్స్ విభాగంలో 140 పోస్టులు, ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో 122 పోస్టులు ఉండగా, అన్నింటికీ అభ్యర్థులు అర్హత సాధించడంతో పూర్తిస్థాయిలో భర్తీ చేయనున్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) పోస్టులు 430 ఉండగా, అన్ని పోస్టులను భర్తీ చేయనున్నారు. ఎస్‌జీటీ ఉర్దూ విభాగంలో 26 పోస్టులు ఉండగా, 23 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. మిగిలిన మూడు పోస్టులకు అభ్యర్థులు అర్హత సాధించకపోవడంతో నిలిపివేశారు.

మున్సిపాలిటీల్లో..

జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఎస్‌ఏ తెలుగు విభాగంలో 2, సంస్కృతం విభాగంలో 1, హిందీ విభాగంలో 1 పోస్టును భర్తీ చేయనున్నారు. ఎస్‌ఏ ఇంగ్లీష్ విభాగంలో 2 పోస్టులకు ఒక్కరే అర్హత సాధించారు. దీంతో ఒక పోస్టును నిలిపివేశారు. ఎస్‌ఏ మేథమెటిక్స్ విభాగంలో ఒక పోస్టును భర్తీ చేయనున్నారు. ఫిజికల్ సైన్స్‌లో 1, బయాలాజికల్ సైన్స్‌లో 1, సోషల్ స్టడీస్‌లో 2, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో 1, ఎస్‌జీలో 18 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఎస్‌ఈటీ విభాగంలో 3 పోస్టులకు ఇద్దరే అర్హత సాధించారు. దీంతో ఒక పోస్టు భర్తీ నిలిపివేశారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపల్ కార్పొరేషన్లలోని పాఠశాలల్లో టీచర్ పోస్టుల ఖాళీలను బట్టి సంబంధిత పాఠశాలల్లో రానున్న రోజుల్లో కొత్తగా ఎంపికైన టీచర్లకు పోస్టింగ్‌లు ఇవ్వడం జరుగుతుందని డీఈవో పీవీజే రామారావు తెలిపారు. అభ్యర్థుల సౌకర్యార్థం డీఈవో కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. మచిలీపట్నం ఎంఈవో ఎంవీఎస్‌డీ ప్రసాద్ సెల్ నెంబరు 94415 20389, అవనిగడ్డ ఎంఈవో ఎన్.శివశంకర్ సెల్ నెంబరు 92473 67099, తోట్లవల్లూరు ఎంఈవో బి.సురేష్ సెల్ నెంబరు 94908 79139తో హెల్ప్‌డెస్క్‌లో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

వ్యవసాయం

(5వ పేజీ తరువాయి)

రెవెన్యూ విభాగాల మధ్య వివాదం నడుస్తోందన్నారు. ఈ భూముల సమస్యను పరిష్కరించేందుకు ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి పరిష్కరించాలని కోరారు. ఈ అంశంపై అధ్యయనం చేసి సమస్యను పరిష్కరించాలని పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి ఎస్.యువరాజ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. మచిలీపట్నంలో 122 డ్రెయిన్లు అసంపూర్తిగా నిర్మించారని, ఈ డ్రెయిన్లకు సంబంధించిన లింక్‌లను కలిపేందుకు రూ.13 కోట్ల నిధులు అవసరమవుతాయని కలెక్టర్ కోరారు. నిధులు విడుదల చేస్తామని, త్వరగా పనులు పూర్తి చేయాలని కలెక్టర్ బాలాజీని ముఖ్యమంత్రి ఆదేశించారు.

స్వర్ణాంధ్ర కేపీఐ స్కోర్ ఇలా..

స్వర్ణాంధ్ర కీ పర్ఫామెన్స్ ఇండికేటర్ (కేపీఐ) స్కోర్లను కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర-2047లో భాగంగా నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించటంలో ఆయా జిల్లాల పనితీరును అంచనా వేసేందుకు ప్రభుత్వం కేపీఐ స్కోర్‌ను తొలిసారిగా ప్రవేశపెట్టింది. రాష్ట్రంలోనే ఎన్టీఆర్ జిల్లా మూడో స్థానంలో నిలిచింది. 64 స్కోర్‌తో బీ గ్రేడ్‌ను సాధించింది. కృష్ణాజిల్లా కూడా 61 పాయింట్లతో బీ గ్రేడ్‌ను సాధించింది. మండలాల వారీగా కూడా ముఖ్యమంత్రి కేపీఐ స్కోర్‌ను ప్రకటించారు. ఎన్టీఆర్ జిల్లాలో నందిగామ మండలం 82, విజయవాడ పశ్చిమ మండలం 82, విజయవాడ తూర్పు మండలం 80 స్కోర్‌ను సాధించి ఏ గ్రేడ్‌లో నిలిచాయి. కృష్ణాజిల్లాలో గూడూరు మండలం 56 స్కోర్‌తో బీ గ్రేడ్‌లో నిలిచింది. వ్యవసాయానుబంధ రంగాలకు సంబంధించి చూస్తే కృష్ణాజిల్లా 31 కేపీఐ స్కోర్‌తో ఏడో స్థానంలో నిలిచి సీ గ్రేడ్‌ను సాధించగా, ఎన్టీఆర్ జిల్లా 30 స్కోర్‌తో 9వ స్థానంలో నిలిచి సీ గ్రేడ్ పొందింది.

స్థూల విలువ జోడింపు ఇలా..

వ్యవసాయానుబంధ రంగాల్లో కృష్ణాజిల్లా దుమ్ము దులిపింది. రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన రూ.45,679 కోట్ల (15.21%) లక్ష్యానికి రూ.8,368 కోట్ల (18.32%) జీవీఏ సాధించింది. ఎన్టీఆర్ జిల్లా 17వ స్థానంలో నిలిచింది. నిర్దేశించిన రూ.12,632 కోట్ల (15.94%)కు గాను రూ.1,427 కోట్ల (11.29%) జీవీఏ సాధించింది. మత్స్య రంగంలో కృష్ణాజిల్లాలోని కృత్తివెన్ను మండలం రూ.4,663 కోట్లు, నందివాడ మండలం రూ.3,801 కోట్లు, బంటుమిల్లి రూ.3,106 కోట్లు, నాగాయలంక రూ.2,802 కోట్ల జీవీఏ సాధించాయి. పాడి పరిశ్రమకు సంబంధించి కృష్ణాజిల్లా రూ.6.026 కోట్ల జీవీఏ సాధించింది. పారిశ్రామిక రంగంలో ఎన్టీఆర్ జిల్లా 77 స్కోర్‌తో 8వ స్థానంలో నిలిచి ఏ గ్రేడ్, కృష్ణాజిల్లా 49 స్కోర్‌తో 23వ స్థానంలో నిలిచి సీ గ్రేడ్‌ను పొందాయి. కృష్ణాజిల్లాకు ఇచ్చిన లక్ష్యంలో భాగంగా మొదటి క్వార్టర్‌లో రూ.3,064 కోట్ల జీవీఏ సాధించి ఆరో స్థానంలోనూ, ఎన్టీఆర్ జిల్లా రూ.4,943 కోట్లతో 13వ స్థానంలోనూ నిలిచాయి. సేవారంగంలో కృష్ణాజిల్లా 91 స్కోర్‌తో రెండో స్థానంలో నిలిచి ఏ ప్లస్ గ్రేడ్‌ను సాధించగా, ఎన్టీఆర్ జిల్లా 90 స్కోర్‌తో ఐదో స్థానంలో నిలిచి ఏ ప్లస్ గ్రేడ్‌ను సాధించింది. ఎన్టీఆర్ జిల్లా రూ.14,007 కోట్లు, కృష్ణాజిల్లా రూ.6,357 కోట్ల జీవీఏను సాధించాయి.

మార్పు మంచిదే..

(5వ పేజీ తరువాయి)

భూములు తీసుకోవాలని సూచిస్తోంది. ఆ భూముల్లో రైల్వేస్టేషన్‌ను నిర్మించి ప్రస్తుత మెయిన్ లైన్‌ను ఎలివేటెడ్ విధానంలో విజయవాడ రైల్వేస్టేషన్, కృష్ణానది మీదుగా కృష్ణా కెనాల్ జంక్షన్‌కు తీసుకెళ్లాలని సూచిస్తోంది. రాయనపాడు, కొండపల్లి మీదుగా వచ్చే లైన్లు, ఖమ్మం మీదుగా వచ్చే లైన్లను కూడా అవుటర్ ఏరియా నుంచి ఎలివేటెడ్ విధానంలో తీసుకొచ్చి సింగ్‌నగర్ ఎలివేటెడ్ కారిడార్‌కు అనుసంధానం చేయాలన్నది ప్రతిపాదన.

10-12 వరసల ఎలివేటెడ్ కారిడార్‌కు ప్రతిపాదన

విజయవాడ ఏ1 రైల్వేస్టేషన్‌పై రద్దీని నివారించటానికి వీలుగా 10-12 వరసల ఎలివేటెడ్ కారిడార్ విధానాన్ని పరిశీలించాలని సూచిస్తోంది. విజయవాడ రైల్వేస్టేషన్ విస్తరణ ప్రణాళికల నేపథ్యంలో ఒక వరసకు 5, 6 లైన్లను ప్రతిపాదిస్తోంది. రానూపోనూ 10-12 వరసలకు ప్రతిపాదిస్తోంది. గుణదల రైల్వేస్టేషన్ మీదుగా వచ్చే మెయిన్ లైన్ దాటాక అజిత్‌సింగ్‌నగర్ ప్రతిపాదిత స్టేషన్ వైపు ఎలివేటెడ్ కారిడార్‌ను ప్రారంభించాలని సూచిస్తోంది. ఈ ఎలివేటెడ్ కారిడార్ అర్ధ చంద్రాకారంలో కృష్ణానది మీదుగా కృష్ణా కెనాల్ జంక్షన్‌కు వెళ్తుంది. రాయనపాడు, కొండపల్లి, ఖమ్మం నుంచి వచ్చే లైన్లు కూడా సింగ్‌నగర్ దాటాక ఎలివేటెడ్ కారిడార్‌కు అనుసంధానమవుతాయి.

రోడ్డు కమ్ ఎలివేటెడ్ కారిడార్ ప్రతిపాదన

విజయవాడ నుంచి అమరావతి చేరుకోవటానికి వీలుగా రోడ్డు కమ్ బ్రిడ్జి ప్రతిపాదన మంచిదని ఎస్‌సీఆర్ఎంయూ సూచిస్తోంది. ఇలా చేస్తే విజయవాడ నుంచి అమరావతికి నేరుగా మార్గం ఏర్పడుతుందని చెబుతోంది. విజయవాడ నుంచి అమరావతి వెళ్లడానికి ప్రకాశం బ్యారేజీ, కనకదుర్గమ్మ వారధి మీదుగా తప్ప వేరే మార్గం లేదు. విజయవాడ వెలుపల నుంచి అయితే గొల్లపూడి నుంచి వెస్ట్ బైపాస్ మీదుగా వెళ్లొచ్చు. దీనివల్ల ట్రాఫిక్ కష్టాలను చవిచూడాల్సి వస్తోంది. రైల్వే ఎలివేటెడ్ కారిడార్‌లో భాగంగా రోడ్డు మార్గాన్ని కూడా ఏర్పాటుచేస్తే ఉభయతారకంగా ఉంటుందని ప్రతిపాదిస్తోంది.

ఇదే సరైన తరుణం

విజయవాడ రైల్వేస్టేషన్‌ను రీ లోకేట్ చేయటానికి ఇదే మంచి తరుణం. రైల్వేస్టేషన్‌లో రెండు టెర్మినళ్లు ఉన్నాయి. మొదటి టెర్మినల్ శిథిలావస్థకు చేరింది. దానిని కూల్చేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఈ టెర్మినల్‌లో చాలావరకు షాపులు ఖాళీ చేయించారు. రెండోది కూడా పాత టెర్మినల్ అయినప్పటికీ బయట మాత్రం కొత్త లుక్ ఇచ్చారు. రైల్వేస్టేషన్ రీ డెవలప్‌మెంట్‌లో భాగంగా ఈ భవనం స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించటానికి డిజైన్లు రూపొందించారు. నూతన రైల్వేస్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న తరుణంలో ఎస్‌సీఆర్ఎంయూ నుంచి రాబోతున్న ప్రతిపాదన ఆలోచింపజేసేదిగా ఉంది.

కొత్త ఎస్పీగా విద్యాసాగర్

(5వ పేజీ తరువాయి)

నుంచి భద్రతను పెంచటంతో పాటు సైబర్ నేరాలను నియంత్రిస్తామని హామీ ఇచ్చారు. గంజాయి, మాదకద్రవ్యాలు జిల్లాలోకి రాకుండా ఉక్కుపాదం మోపుతామన్నారు. జిల్లాను నేరరహితంగా తీర్చిదిద్దేందుకు సిబ్బందిని ఎల్లవేళలా అప్రమత్తం చేస్తూ, వారి సమస్యలు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. చిన్నారులు, వృద్ధులు, మహిళల రక్షణ పట్ల ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, పోలీస్ శాఖ నుంచి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్లపై విచ్చలవిడిగా పశువులను వదిలేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్న వారికి కూడా అవగాహన కల్పిస్తామన్నారు. వాహనాలను నడిపే చిన్నపిల్లలను ఉపేక్షించబోమని, పిల్లలకు వాహనాలు ఇస్తున్న తల్లిదండ్రులకు శిక్షలు పడేలా చర్యలు ఉంటాయన్నారు.

కొత్త ఎస్పీ ప్రస్థానమిలా..

2016లో ఇండియన్ పోలీస్ సర్వీస్ ద్వారా పోలీస్ శాఖలో అడుగుపెట్టి అసాల్ట్ కమాండర్ గ్రేహౌండ్స్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ చింతపల్లి, డిప్యూటీ పోలీస్ కమిషనర్ లా అండ్ ఆర్డర్ విశాఖపట్నం, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గ్రేహౌండ్స్ అన్నమయ్య జిల్లాలో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా బాధ్యతలు నిర్వహించి సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి ఎస్పీగా వచ్చారు.

ఆక్రమిత భూములకు విముక్తి

(5వ పేజీ తరువాయి)

చేసుకునేందుకు వీలుగా ఎన్టీఆర్, కృష్ణాజిల్లా యంత్రాంగాలు ప్రభుత్వ భూముల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేశాయి.

యార్లగడ్డ పోరాటం కారణంగానే..

గన్నవరం నియోజకవర్గంలో ఆక్రమిత భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చాలాకాలంగా పోరాడుతున్నారు. జిల్లాస్థాయి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన కలెక్టర్ల దృష్టికి కూడా తీసుకెళ్తున్నారు. మచిలీపట్నంలో ఇటీవల జరిగిన జెడ్పీ సమావేశంలో కూడా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కృష్ణా పరిధిలోని గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు మండలాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణకు సంబంధించి తక్షణం చర్యలు చేపట్టాలన్నారు. ఆగస్టులో జరిగిన ఎన్టీఆర్ జిల్లా సమీక్షా సమావేశంలో విజయవాడ రూరల్ మండల పరిధిలోని తొమ్మిది గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కావటాన్ని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన రూరల్ మండల తహసీల్దార్, ఎంపీడీవో, సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో కమిటీని ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించి జాయింట్ కలెక్టర్ ఇలక్కియా ఉత్తర్వులు కూడా ఇచ్చారు. ఇక కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కూడా స్పందిస్తూ జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో), గుడివాడ ఆర్డీవో, గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు తహసీల్దార్లు, గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు ఎండీవోలు, ఆ మూడు మండలాల పరిధిలోని గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలతో కమిటీ ఏర్పాటు చేశారు.

అభివృద్ధికి ఆస్కారం

ఆక్రమణల చెరలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటే గన్నవరం నియోజకవర్గ అభివృద్ధికి ఉపయోగపడుతుంది. ఇప్పటికే రెండు, మూడు సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ఎమ్మెల్యే అనుమతులు తీసుకొచ్చారు. వీటితో పాటు వాటర్ ట్యాంకులు కట్టడానికి, చెత్త సంపద కేంద్రాలు నిర్మించటానికి, ఉద్యానవనాలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు.. ఇలా ఏవి నిర్మించాలన్నా స్థలాలు లేకుండాపోతున్నాయి. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే యార్లగడ్డ సూచనకు రెండు జిల్లాల యంత్రాంగాలు స్పందించి కమిటీలు ఏర్పాటు చేశాయి. ఈ కమిటీలు క్షేత్రస్థాయిలో ఆక్రమణలను నిగ్గు తేల్చాల్సి ఉంటుంది. ఆ తర్వాత సమగ్ర నివేదికను కలెక్టర్లకు సమర్పిస్తారు. ఆ తర్వాత ఎమ్మెల్యే సమక్షంలో చర్చించి వాటి స్వాధీనంపై తుది నిర్ణయం తీసుకుంటారు.

13 మందికి ఎండీవోలుగా పదోన్నతి

(5వ పేజీ తరువాయి)

ఇచ్చారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అధికారులే కాకుండా విజయనగరం, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి వచ్చిన డిప్యూటీ ఎండీవోలకు కూడా ఎండీవోలుగా పదోన్నతి కల్పించారు. జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, జడ్పీ సీఈవో కన్నమనాయుడు సోమవారం వీరికి ఉత్తర్వులు జారీ చేశారు. మొవ్వ ఏవోగా పనిచేస్తున్న ఎన్.శ్రీనివాసరావును కృత్తివెన్ను ఎండీవోగా, గన్నవరం ఏవోగా పనిచేస్తున్న డి.శకుంతలను ఇబ్రహీంపట్నం ఎండీవోగా, వీరులపాడు ఏవోగా పనిచేస్తున్న బి.రాజును ఏలూరు మండలం చాట్రాయి ఎండీవోగా, కంచికచర్ల మండలం ఏవోగా పనిచేస్తున్న ఎంఎం ఆనందకుమారిని చల్లపల్లి ఎండీవోగా, పమిడిముక్కల మండలం ఈవోఆర్డీగా పనిచేస్తున్న డి.వెంకటేశ్వరరావును కంచికచర్ల మండలం ఎండీవోగా, ఎ.కొండూరు మండలం ఈవోఆర్డీగా పనిచేస్తున్న టి.సరస్వతిని గంపలగూడెం ఎండీవోగా, నూజివీడు డీఎల్‌పీవో కార్యాలయం ఏవో ఆర్.రాజాబాబును కైకలూరు ఎండీవోగా, కంచికచర్ల డిప్యూటీ ఎండీవో పి.ఏసుబాబును మునునూరు ఎండీవోగా, బంటుమిల్లి ఈవోఆర్డీ పి.శైలజా కుమారిని బంటుమిల్లి ఎండీవోగా, విజయనగరం జిల్లా గుర్ల డిప్యూటీ ఎండీవో కేఎస్ఎస్ అన్నపూర్ణాదేవిని గుడ్లవల్లేరు ఎండీవోగా, పల్నాడు జిల్లా ముప్పాళ్ల ఈవోఆర్డీ ఎస్.రూపవతిని వీరులపాడు ఎండీవోగా, పల్నాడు జిల్లా మాచవరం ఈవోఆర్డీ డి.వెంగలరావును నాగాయలంక ఎండీవోగా, బాపట్ల జిల్లా అద్దంకి ఆర్‌వీఎస్ ప్రసాదరావును నందిగామ ఎండీవోగా పదోన్నతులు కల్పించారు.

చిల్లర పనులు

(5వ పేజీ తరువాయి)

ప్రాంతాల నుంచి వస్తారు. ఆది, మంగళ, శుక్రవారాల్లో 45 వేల నుంచి 50 వేల మంది వరకు ఉంటారు. ఇలా వచ్చిన భక్తుల్లో రోజుకు 2 వేల మంది అమ్మవారికి తలనీలాలు సమర్పిస్తారు. ఇక్కడి నుంచే దోపిడీ మొదలవుతుంది. టికెట్ ధరకు మించి డబ్బు వసూలు చేయొద్దని అధికారులు ఆదేశించినా సిబ్బంది ఖాతరు చేసే పరిస్థితి కనిపించట్లేదు. అధికారులు తనిఖీలకు వస్తే మాత్రం జాగ్రత్తగా ప్రవర్తిస్తున్నారు. నిత్యం తలనీలాలు సమర్పించడానికి వచ్చే భక్తుల్లో సగం మందికి తిరిగి చిల్లర ఇవ్వట్లేదనే ఆరోపణలు వస్తున్నాయి. రోజుకు రూ.10 వేల చొప్పున అదనపు ఆదాయాన్ని కేశఖండన శాలలోని కౌంటర్ సిబ్బంది పక్కకు తీస్తున్నారు. దీనిపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భక్తుల నుంచి సేకరిస్తున్న ఐవీఆర్ఎస్ సర్వేలోనూ సిబ్బంది వసూళ్లపై ఫిర్యాదులు అందుతున్నాయి.

అదనపు చదివింపులు

తలనీలాలు సమర్పించాక కూడా డబ్బు చెల్లించాల్సి వస్తోంది. తలనీలాలు తీసినందుకు రూ.50 ఇవ్వాలని అడుగుతున్నారు. ఒక కుటుంబంలో నలుగురు తలనీలాలు సమర్పిస్తే రూ.200 క్షురకుడి చేతిలో పెట్టాల్సి వస్తోంది. అడిగినంత ఇవ్వని భక్తులపై పరుష పదజాలంతో మాట్లాడుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

దుర్గగుడికి విరాళాలు

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి పలువురు దాతలు సోమవారం ఆలయ అధికారులకు విరాళాలు అందజేశారు. వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం అధికారులు దాతలకు అమ్మవారి చిత్రపటంతో పాటు విరాళం రశీదు, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. విజయవాడ తాడిగడపకు చెందిన చింతపల్లి రంగారావు దంపతులు చింతపల్లి జగన్మోహన్ పేరు మీద అన్నదాన పథకానికి రూ.1,00,116లు అధికారులకు అందజేశారు.



కౌలురైతులకు రుణాలు ఇవ్వాలి



కెనరాబ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌలురైతులు

ఉంగుటూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కౌలురైతు గుర్తింపుకార్డు (సీసీఆర్సీ)లున్న ప్రతి కౌలురైతుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఏవిధమైన ష్యూరిటీ లేకుండా రుణాలు మంజూరు చేయాలని కౌలు రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టీవీ లక్ష్మణస్వామి డిమాండ్ చేశారు. కౌలుదారులకు సీసీఆర్సీ కార్డుపై రుణం ఇవ్వాలంటే కచ్చితంగా ఎవరో ఒకరు ష్యూరిటీ కావాలని, ఒక్కో రైతుకు 50వేలకు మించి రుణం ఇవ్వడం కుదరదని స్థానిక కెనరా బ్యాంక్ మేనేజర్ కిరణ్ స్పష్టం చేసిన నేపథ్యంలో సోమవారం కౌలురైతులందరూ పెద్దసంఖ్యలో బ్యాంకు వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మేనేజర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయకార్మికసంఘం జిల్లా సహాయకార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం నాయకులు సలీం, మాగంటి సాంబశివరావు, టీవీ రామ్మోహనరావు, పిల్లి రాజారావు, రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుక

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం శ్రీవైష్ణవ సంప్రదాయం ప్రకారం బాద్రపద బహుళ అష్టమిని పురస్కరించుకొని కృష్ణాష్టమి వేడుకను వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో వై.శ్రీనివాస్ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు స్వామి వారికి పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామాచర్చన, కార నైవేద్యాలతో నీరాజనాలు పలికారు. ఆలయ ట్రస్టీ కాకాని బాబు, అరుణ దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గాలికుంటు వ్యాధిపై అవగాహన అవసరం

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పశువుల్లో వర్షాకాలంలో సంక్రమించే గాలికుంటు వ్యాధి పట్ల రైతులు అవగాహన పెంచుకొని నివారణ చర్యలు చేపట్టాలని బాపులపాడు పశుసంవర్థక శాఖ ఏడీ డాక్టర్ ప్రమీళరాణి రైతులకు విజ్ఞప్తి చేశారు. జాతీయ పశు వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా గాలికుంటు టీకాలు వేసే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. అక్టోబరు 15 వరకు నెలరోజుల పాటు గాలికుంటు టీకాలు వేసే కార్యక్రమం పశువైద్యశాలల్లో కొనసాగుతుందని తెలిపారు.

ఉంగుటూరు : పాడి పశువుల్లో పాల ఉత్పాదకతా శక్తిని దెబ్బతీయడంతో పాటు మగపశువుల్లో పనిచేసే సామర్థ్యాన్ని గణనీయంగా తగ్గించి, రైతుకు ఆర్థికంగా నష్టం కలిగించే గాలికుంటు వ్యాధిపట్ల పశుపోషకులు అప్రమత్తంగా వుండాలని తేలప్రోలు ప్రభుత్వ పశు వైద్యాధికారి డాక్టర్ చింతల మల్లిబాబు అన్నారు. పశువుల్లో గాలికుంటువ్యాధి సోకకుండా ముందస్తుగా నివారణ టీకాలు వేసే కార్యక్రమం సోమవారం స్థానిక వెటర్నరీ ఆసుపత్రిలో ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయానికి విరాళం

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : స్థానిక బాపులపాడు శ్రీభ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జునస్వామి దేవాలయం ప్రాంగణంలో నూతనంగా చేపట్టిన అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం అంపాపురానికి చెందిన వేమూరి వెంకటకృష్ణారావు గురుస్వామి రూ.50వేలు విరాళం అందించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గూడవల్లి చిన్నా తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు గూడపాటి రత్నశేఖర్ ద్వారా విరాళం అందజేశారని తెలిపారు. దాతకు కమిటీ తరుపున అభినందనలు తెలియజేశారు.

లైట్ హోం ఉపాధ్యాయుడికి ప్రతిభా అవార్డు



గన్నవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లనపల్లి లైట్ హోం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఉపాధ్యాయుడుకు పాన్ ఇండియా ఎడ్యుకేషన్ ప్రతిభా అవార్డు లభించింది. సోమవారం హైస్కూల్‌లో డైరెక్టర్ బ్రదర్ చౌటపల్లి ఎలీషా, ప్రిన్సిపాల్ ప్రమీలలు, విద్యార్థులు జీవశాస్త్రం ఉపాధ్యాయుడు ఇరుగు జాన్‌వెస్లీని అభినందించారు. ఇటీవల గుంటూరులోని పాన్ ఇండియా ఐకానిక్ సంస్థ నెక్స్ట్ జనరేషన్ హైస్కూల్‌లో అవార్డు అందజేసినట్లు జాన్‌వెస్లీ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో భగవద్గీత పారాయణం



గన్నవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసరపల్లి శివారులోని పంచతత్వ గురుపాదుకా నిలయం నందు అష్టమి సందర్భంగా సద్గురు సచ్చిదానంద స్వామీజీ ఆజ్ఞానుసారం దత్తాత్రేయ స్వామివారికి సోమవారం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనఘాష్టమి వ్రతం చేసి భగవద్గీత పారాయణం భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా ఘననాథుడి విగ్రహం ఊరేగింపు



కంకిపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని పందిరిలోని ఘననాథుడి ఊరేగింపు సోమ వారం ఘనంగా నిర్వహించారు. కంకిపాడు ఒకటవ తూము నుంచి ప్రారంభమైన ఊరేగింపు బందరు రోడ్డు, గన్న వరం రోడ్డు మీదుగా లాకు రోడ్డులోని బందరు కాలువలో నిమజ్జనం వరకు ఎంతో వైభవంగా జరిగింది. నాయీ బ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అన్నసంతర్పణలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల ప్రతిభ



కానూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాలలో వన్ ఆంధ్ర ఈఎంఈ కంపెనీ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఎన్‌సీసీ సమ్మిళిత వార్షిక శిక్షణ శిబిరంలో కానూరులోని పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల కేడెట్‌లు పలు అంశాలల్లో ప్రతిభ కనపరిచారు. ప్రతిభ కనపరిచిన ఎన్‌సీసీ కేడెట్‌లు, అందుకు దోహద పడిన కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ఎం. ధదుర్య నాయక్‌ను సోమవారం కానూరులోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబును అభినందించారు.

అసైన్డ్ భూముల సమస్యను పరిష్కరించాలి

ఉంగుటూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎలుకపాడు అసైన్డ్ భూముల ఆన్‌లైన్ సమస్యను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాచేటి మురళి డిమాండ్ చేశారు. మండలంలోని ఎలుకపాడు అసైన్డ్ భూములను ఆన్‌లైన్‌చేసి పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ భూబాధితులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష సోమవారం ఏడవ రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరాన్ని సందర్శించిన మురళి భూబాధితులకు మద్దతు తెలిపి అండగా వుంటామని భరోసా ఇచ్చారు.

గోసాల-మద్దూరు రోడ్డు అభివృద్ధి చేస్తాం

పెనమలూరు - వణుకూరు డొంకరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పెనమలూరు- వణుకూరు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా గోసాల, వణుకూరు, మద్దూరు తదితర గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్న గోసాల మద్దూరు రోడ్డును త్వరలోనే టెండర్లు పిలిచి నిర్మాణం పూర్తి చేస్తామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. అప్పటి వరకు రోడ్డుపై ఉన్న భారీ గుంతలను తన సొంత ఖర్చుతో పూడ్చే పనిని రెండు మూడు రోజుల్లో ప్రారంభిస్తామని ఆయన అన్నారు. సోమవారం రూ. 1.80కోట్ల నాబార్డు నిధులతో మూడున్నర కిలోమీటర్ల పొడవైన పెనమలూరు వణుకూరు కనెక్టివిటీ డొంకరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఎమ్మెల్యే మాట్లాడారు. ఏడెనిమిదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని గోసాల మద్దూరు రోడ్డును గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. కార్యక్రమంలో వణుకూరు గ్రామ సర్పంచి చెక్కజాన విజయరామలక్ష్మీ, టీడీపీ కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, సంగెపు రంగారావు, కొమ్మినేని శ్రీనివాసరావు, యేకుల విజయేంద్ర, లింగాల భాస్కరరావు, కాసరనేని రాము, సుంకర రమేష్, పులి విజయ్, బుడుగు సాంబశివరావు, పిడికిటి శ్రీనివాసరావు, డీఈ రాజశేఖరరెడ్డి, ఏఈ రాఘవేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

తోపుడు బళ్లు పంపిణీ

తాడిగడప మునిసిపాలిటీలోని యనమలకుదురుకు చెందిన గోనా నాగలక్ష్మి, చందా మంగమ్మ అనే నిరుపేదలకు యువనేత బోడె వెంకట్రాం సోమవారం తోపుడు బళ్లు పంపిణీ చేశారు. బడుగు బలహీన వర్గాల వారిని ఆదుకోవడంలో తాను ముందుంటానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నేతలు కొండా ప్రవీణ్, ఇబ్రహీం, వీరయ్య పాల్గొన్నారు.



ఏడీఈ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

విద్యుత్ ఉద్యోగుల నిరసన

ఉయ్యూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో విద్యుత్ సంస్థల యాజమాన్యం నిర్లక్ష ధోరణి అవలంబిస్తూ కార్మిక సంఘాలు గతంలో సాధించుకున్న ప్రయోజనాలను ఉపసంహరిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తున్నాయని 1104 ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎం. మోహన్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. యూనియన్ల నాయకులు జి.నాగరాజు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, సురేశ్, కాంట్రాక్ట్ కార్మికుల రీజినల్ ప్రెసిడెంట్ పామర్తి ఆంజనేయులు, ఉయ్యూరు డివిజన్ ప్రెసిడెంట్ సురేశ్, సెక్రటరీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంపై అవగాహన

కానూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో వర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొని ప్రజాస్వామ్య ప్రాధాన్యత, పౌరుల హక్కులు, బాధ్యతలు, సమాజ అభివృద్ధిలో ప్రజాస్వామ్య వ్యవస్థ పాత్ర తదితర అంశాలపై అవ గాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జె. శివరాం ప్రసాద్‌తోపాటు వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

ధనేకులలో 2.0 జెమినీ ఏఐపై సదస్సు

పెనమలూరు, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్స్‌డే సందర్భంగా ఇంజనీరింగ్ 2.0జెమిని ఏఐ సదస్సు నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కడియాల మాట్లాడుతూ, విద్యార్థులు జెమిని ఏఐ ప్రోను ఏవిధంగా ఉపయోగించుకోవాలి, విద్య, సమస్యల పరిష్కారంలో జెమిని ఏవిధంగా సహాయపడుతుంది వంటి అంశాలను వివరిస్తూ విద్యార్థులకు మార్గ నిర్దేశనం చేశారు. ఈకార్యక్రమాన్ని గూగుల్ స్టూడెంట్సు అంబాసిడర్స్ అయిన కే మైత్రి, ఎస్ గాయత్రి, ఎం లిఖిత, రాంచరిత్‌రెడ్డి నిర్వహించారు.

ఉయ్యూరు రైతు బజారు పరిశీలన

ఉయ్యూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రైతులు, వినియోగదారులకు మేలు జరగాలన్న లక్ష్యంతో నిర్వహిస్తున్న రైతుబజార్లలో తాజా కూరగాయలు అందుబాటులో ఉండేలా స్టాల్స్ నిర్వాహకులు బోర్డు ధరకే వినియోగదారులకు విక్రయించాలని ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఉయ్యూరు రైతుబజార్‌లో స్టాల్స్‌ను సోమవారం పరిశీలించి కూరగాయల నాణ్యత గురించి వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. మున్నంగి శ్రీనివాసరెడ్డి, శివ, సాంబశివరావు చైర్మన్‌తో ఉన్నారు.

నడిరోడ్డుపై కారు..ట్రాఫిక్‌కు అంతరాయం



రోడ్డుపైన నిలిపేసిన కారు

కంకిపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక లాకు రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. కంకిపాడు నుంచి గొడవర్రు, రొయ్యూరు, బొడ్డపాడు, పులపాక, వల్లూరు పాలెం వంటి ప్రధాన గ్రామాలకు ప్రధాన రహదారి. అటు వంటి ఈ రహదారిపై సోమవారం మధ్యాహ్నం ఓ వాహనదారుడు తన వాహనాన్ని నడి రోడ్డుపై ఆపేశాడు. పక్కనే ఉన్న యూనియన్ బ్యాంక్‌లోకి వెళ్లాడు. రావడానికి గంటకు పైగా పట్టింది. దీంతో లాకు రోడ్డులో వాహనాలు నిలిచి పోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వైసీపీ పాలనలో కుంటుపడిన అభివృద్ధి

కంకిపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్ల వైసీపీ హయాంలో కంకిపాడు అభివృద్ధికి నోచుకోలేదని సర్పంచ్ బాకి రమణ అన్నారు. కంకిపాడు పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన పాలకవర్గ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమణ మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క రోడ్డు, ఒక్కటంటే ఒక్కటి డ్రెయినేజీ నిర్మాణానికి పంచాయతీకి నిధులు రాలే దన్నారు. పంచాయతీలకు రావాల్సిన ఉపాధి నిధులు కూడా గత ప్రభుత్వం దారి మళ్లించిందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి, ఈవో నక్కా రాజేంద్రవరప్రసాద్, గుమస్తా సూర్య, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని వెలికితీయాలి

గన్నవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహిం చాల్సిన అవసరం ఎంతైన ఉందని సర్పంచ్ నిడమర్తి సౌజన్య అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో 69వ పాఠశాలల క్రీడా సమాఖ్య అండర్-14, 17 బాలబాలికల జిల్లా స్థాయి రాగబీ ఎంపికలు సోమవారం జరిగాయి. ఈ పోటీలను సర్పంచ్ సౌజన్య ప్రారంభించారు. కేవీఆర్ కిషోర్,హెచ్ఎం ఎ.సునీల, అరుణ, రాంబాబు, దుర్గారావు, టి.వెంకయ్య, మడుపల్లి బాలకృష్ణమూర్తి, పీడీలు పాల్గొన్నారు.

హీటర్ షాక్‌తో గాయపడ్డ బాలుడి మృతి

పెనమలూరు, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ హీటర్‌తో నీళ్లు వేడి చేస్తుండగా ఐదేళ్ల బాలునికి షాక్ తగిలి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన యనమలకుదురు శివపార్వతీనగర్‌లో జరిగింది. ఈఘటనపై కేసు నమోదు చేసిన పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆగస్టు 27న రాజశేఖర్ భార్య కుమారుడు ఆడుకుంటుండగా బకెట్‌లో హీటర్‌ను పెట్టి నీళ్లు కాచే పనిలో ఉండగా బాలుడు పొరపాటున బకెట్‌లో చెయ్యిపెట్టాడు. దీంతో అతనికి కరెంట్ షాక్ తగిలింది. చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం బాలుడు మృతి చెందాడు.

నవభారత నిర్మాణ రూపశిల్పి మోక్షగుండం





రంగన్నగూడెం నీటి వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో.. జ్యోతి పాలిటెక్నిక్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : తాగు నీరు, సాగునీటి ప్రాజెక్టులతో విశిష్ట సేవలందిస్తూ ఎన్నో అత్యుత్తమ ప్రాజెక్ట్‌లకు రూపకల్పన చేసిన నవభారత నిర్మాణ రూపశిల్పి భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని ఎన్ఎస్ ఎల్సీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ కొనియాడారు. రంగన్నగూడెం నీటి వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జయంతి సందర్భంగా సోమవారం చిత్రపటానికి పూలమాలలు వేసి రైతులతో కలిసి నివాళులర్పించారు. ఎంపీటీసీ పుసులూరి, పీఏసీఎస్ చైర్మన్ కనకవల్లి శేషగిరిరావు, కసుకుర్తి నరసింహారావు, దేవరకొండ వెంకటేశ్వరరావు, తలారి ఏసు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : ఇంజనీర్ రంగంలో ఎన్నో ప్రాజెక్టులకు రూపకల్పన చేసి దేశానికి తలమానికంగా నిలిచిన మోక్షగుండం సేవలు చిరస్మరణీయమని జంక్షన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమేష్ చక్రవర్తి పంచకర్ల అన్నారు. సోమవారం స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజనీర్స్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు.

విజయవాడ రూరల్ : నున్న వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో ఇంజనీరింగ్ డే 2025 వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో భాగంగా భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ కె. రామారావు, సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఎన్. సురేష్, కళాశాల కార్యదర్శి ఎన్. సత్యనారాయణరెడ్డి, ప్రొఫెసర్ కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : మానవ మనుగడకు, సామాజిక ప్రగతికి ఇంజనీర్లే మూలస్తంభాలని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం అన్నారు. ఇంజనీరింగ్ పితామహుడు, భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఈసీఈ, ఐఈటీఈ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ డే వేడుకలు స్థానిక కళాశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్, సీఐటీడీ ప్రతినిధులు ఎస్.వెంకటకృష్ణ, మెకానికల్, ఈసీఈ విభాగాధిపతులు ఎస్.మధుసూదన్, బి.నాంచారయ్య, ఆర్అండ్‌డీ ఇంజనీర్ సీహెచ్ సుధాకర్‌రెడ్డి, ఐఈటీఈ చైర్మన్ బి.సూర్యప్రసాద్, డీన్లు సీహెచ్ శాంతిరాణి, సాగర్, కోఆర్డినేటర్లు ఎంకే కిషోర్, టి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితాధారంగా సత్యం, కృషి, నిబద్ధత నేర్చుకుని దేశానికి ఉపయోగపడే ఇంజనీర్లుగా ఎదగాలని శ్రీజ్యోతి పాలిటెక్నిక్ కళాశాల చైర్మన్ ఎస్వీ రమణ విద్యార్థులకు సూచించారు. మోక్షగుండం విశ్వే శ్వరయ్య జయంతి, జాతీయ ఇంజనీర్ల దినోత్సవం పురస్కరించుకుని కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటం వద్ద వెంకటరమణ నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ జన్ను శివకుమార్, అధ్యాపకులు పాల్గొని విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

పేదల ఆరోగ్యానికి సీఎం సహాయనిధి అండ

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. పలు ప్రైవేటు హాస్పిటల్స్‌లో చికిత్స పొందిన రోగులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక టీడీపీ కార్యాలయంలో నాయకులతో కలిసి సోమవారం రాత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, టీడీపీ టౌన్ అధ్యక్షులు జాస్తి శ్రీధర్, మండల అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, దయ్యాల రాజేశ్వరరావు, గొడ్డళ్ల చిన్న రామారావు, నాయకులు కోటగిరి వరప్రసాద్, కాసన్నేని రంగబాబు, కొల్లా ఆనంద్, రేవంత్, అర్నేపల్లి సూరిబాబు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీకి మద్దతుగా భారీ ర్యాలీ రేపు

పెనమలూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాలకపక్ష ఎన్డీయే ప్రభుత్వం ఏవిధంగా ఓట్లు చోరీ చేసిందో ప్రజలకు చెప్పడానికి పిలుపునిచ్చిన రాహుల్‌గాంధీకి మద్దతుగా ఇండి కూటమి పార్టీలు ఈనెల 17న పెనమలూరులో ర్యాలీ నిర్వహించనున్నట్లు కూటమి స్థానిక నాయకులు తెలిపారు. సోమవారం పోరంకి ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. తాడిగడప మునిసిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొసనం రాము మాట్లాడుతూ, ఈ ర్యాలీలో ముఖ్య నాయకులైన గిడుగు రుద్రరాజు, జేడీ శీలం, ధనేకుల మురళి పాల్గొంటారని తెలిపారు. తాడిగడప ఆల్ఫా కేఫ్ నుంచి పోరంకి గాంధీ బొమ్మ సెంటరు వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గీత కార్మికుల సంక్షేమం పట్టని ప్రభుత్వం

- కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు
- ఉయ్యూరులో కల్లుగీత కార్మికుల జిల్లా సదస్సు



ఉయ్యూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికుల సంక్షేమం కూటమి ప్రభుత్వానికి పట్టడంలేదని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాకా రామచంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉయ్యూరులోని నాగళ్ల రాజేశ్వరమ్మ, జానకిరామయ్య విజ్ఞాన కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి, నూతన పథకాలతో ఆదుకుంటారన్న ఆశతో ఎన్నికల్లో కూటమిని గెలిపిస్తే ఒక్క నూతన పథకం కూడా ప్రవేశపెట్టలేదన్నారు. కల్లుగీత వృత్తికి రక్షణ కల్పించాలని కోరుతుంటే మద్యం షాపులు, బార్ల పేరుతో భ్రమలు కల్పిస్తున్నారని విమర్శించారు. అవికూడా బడాబాబులు, మద్యం వ్యాపారులకే దక్కుతున్నాయన్నారు. ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇవ్వకపోవడంతో చెట్టుపై నుంచి పడి మృతి చెందిన వారి కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయని తెలిపారు. తాడి చెట్టుపై నుంచి పడిపోయిన గీత కార్మికులకు మూడు కేటగిరీలుగా విభజించి, చనిపోయిన వారికి రూ. 10 లక్షలు, పూర్తి అంగవైకల్యం ఏర్పడిన వారికి రూ.5 లక్షలు, తాత్కాలిక అంగ వైకల్యం ఏర్పడిన వారికి రూ.లక్ష చొప్పున ఎక్సైజ్ శాఖ ద్వారా నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. భూపతి బోడిబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పామర్తి వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు పలగాని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భూముల వేలంలో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలి

- రంగనాయకస్వామి ఆలయ చైర్మన్ వెంకటేశ్వరరావు



మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం లోని రంగనాయక స్వామి ఆలయం భూముల వేలంపాటలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆ దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్ ఎన్.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వోకు ధర్మకర్తల మండలి సభ్యులు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడారు. 2007లో దేవస్థానానికి చెందిన 197 సర్వే నెంబరులో ఐదు ఎకరాల 33 సెంట్ల భూమి వేలం పాటలో అవకతవకలు జరిగినట్టు ఆలయ కమిటీ దృష్టికి వచ్చిందన్నారు. అప్పటి అధికారులు మచిలీపట్నం బైపాస్‌రోడ్డులోని దేవుడు చెరువు వద్ద ఐదు ఎకరాల 33 సెంట్లు ఎందుకు వేలం వేశారో అర్థంకాని విషయమన్నారు. రోడ్లు వేయకుండా ఆ స్థలంలో కరెంట్ హైపవర్ విద్యుత్ వైర్లు తొలగించారని తెలిపారు. విద్యుత్ వైర్లు తొలగించడానికి ఆ శాఖకు ఎంత సొమ్ము చెల్లించారో చెప్పాలన్నారు. ఈ వ్యవహారం కొందరికి లబ్ధి చేకూరేలా ఉందన్నారు. ఈ అవకతవకలను మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో అన్నం రామకృష్ణ, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

- డీఆర్వో చంద్రశేఖరరావు



మచిలీపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి అందుతున్న మీకోసం అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖర రావు అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఆర్‌వో, కేఆర్‌ఆర్‌సీ ఎస్‌డీసీ శ్రీదేవి, సర్వశిక్ష ప్రాజెక్టు అధికారి కుమిదినిసింగ్‌తో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. తొలుత జిల్లా అధికారుల సమావేశంలో డీఆర్వో మాట్లాడుతూ అర్జీలు పరిష్కరించే అధికారి(జీఆర్‌ఏ) తప్పనిసరిగా అర్జీదారునితో మాట్లాడి అతని సమస్య పరిష్కారం అయ్యిందా లేదా విచారించాలన్నారు. ఐగాట్ కర్మయోగి ఆన్‌లైన్ శిక్షణ తరగతుల్లో ప్రస్తుతం రాష్ట్రంలో మన కృష్ణాజిల్లా నాలుగో స్థానంలో ఉందని, అందుకు కృషి చేసిన అధికారులు అందరికీ అభినందనలు తెలిపారు. కేఆర్‌ఆర్‌సీ ఎస్‌డీసీ శ్రీదేవి మాట్లాడుతూ పంచాయతీరాజ్‌శాఖలో ఎక్కువగా అర్జీలు అపరిష్కృతంగా ఉన్నాయని, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. కలెక్టరేట్‌లో మొత్తం 166 అర్జీలు జిల్లా యంత్రాంగం స్వీకరించింది. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, డీఎస్‌వో మోహన్‌బాబు, డీఎంహెచ్‌వో ఎ.వెంకటరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ లోకేశ్, డీఈవో పి.వి.జె.రామారావు, డీపీవో అరుణ తదితరులు పాల్గొన్నారు.

నియంత్రణలో డయారియా కేసులు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

వన్‌టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విజయవాడ న్యూరాజరాజేశ్వరిపేటలో డయారియా పూర్తి నియంత్రణలో ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ల సదస్సుకు వెళ్లడానికి ముందు స్థానిక అధికారులతో కాల్ కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ చర్యలు, ప్రజాచైతన్యంతో కేసులు తగ్గుముఖం పట్టాయన్నారు. అయిన క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొత్తం 275 మంది చికిత్స పొంది ఇంటికి వెళ్లారని, ఇంకా 42 మంది చికిత్స తీసుకుంటున్నారని చెప్పారు. న్యూ రాజరాజేశ్వరిపేటలోని పరిస్థితి దృష్ట్యా విజయవాడ అర్బన్ పరిధిలో ఎక్కడా డయారియా ప్రబలకుండా చర్యలకు ఆదేశించామన్నారు.

యూటీఎఫ్ రణభేరి బైక్ జాతా ప్రారంభం



జగ్గయ్యపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ నాటికి ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన నాలుగు డీఏలలో రెండైనా ఇవ్వాలని, పీఆర్సీ కమిషన్‌ను వేసి మధ్యంతర భృతి ప్రకటించాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. సోమవారం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో యూటీఎఫ్ నిర్వహిస్తున్న రణభేరి బైక్ జాతాను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పట్టించుకోవాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కుసుమ కుమారి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, టీచర్స్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు, యూటీఎఫ్ నేత ఎం.కృష్ణయ్య మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జాతా ద్వారా ఉపాధ్యాయులను 25న జరిగే రాష్ట్ర సదస్సుకు వచ్చేలా చైతన్యపరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, ఏ.సుందరయ్య పాల్గొన్నారు.

శిలాఫలకాలతో సరి..

- తిరువూరులో గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకం
- హడావిడిగా విత్తనశుద్ధి కర్మాగారం, వాటర్ ట్యాంకు, పైపులైన్లకు శంకుస్థాపన
- ఎన్నికల ముందు వినగడప కట్టలేరు వాగుపై బ్రిడ్జి అంటూ హడావుడి
- కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని వీటిని నిర్మించాలని ప్రజల విజ్ఞప్తి



పైపులైన్ల నిర్మాణ శిలాఫలకం

(తిరువూరు, ఆంధ్రజ్యోతి): ప్రజలను మభ్య పెట్టేందుకు గత వైసీపీ ప్రభుత్వం తిరువూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు అంటూ శిలాఫలకాలు ఏర్పాటు చేసింది. ఆ తర్వాత పనులు చేపట్టకుండా వదిలేసింది. వాటర్ పైపులైన్లు అంటూ ఉన్న రోడ్లను కూడా నాశనం చేసింది. నాటి వైసీపీ పాలకుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు మేలురకం విత్తనాలు అందించేందుకు మండలంలోని లక్ష్మీపురంలో ఎస్‌ఎంఎస్‌పీ అండ్ ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం నిధులు రూ.47.37 లక్షలతో విత్తనశుద్ధి కర్మాగారం నిర్మాణానికి 2021, జూన్ 23న శంకుస్థాపన చేశారు. ఘనంగా శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ కేంద్రం నిర్మాణంతో ఈ ప్రాంత రైతాంగంతో పాటు, ఎన్టీఆర్ జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన రైతులకు మేలురకం విత్తనాల సరఫరా జరుగుతుందని ఆశపడ్డారు. కానీ నాటి నుంచి నేటి వరకు ఈ నిర్మాణం శిలాఫలకానికే పరిమితం అయ్యింది. ఆ ప్రాంతం ముళ్ల పొదలతో నిండిపోయింది. అలాగే పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి సుమారు రూ.167 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. దీనిలో భాగంగా పట్టణంలో వాటర్ ట్యాంక్, పైపులైన్ల నిర్మాణం నిమిత్తం రూ.27.69 కోట్లతో చేపట్టనున్న పనులకు సంబంధించి శాంతినగర్‌లోని వాటర్ ట్యాంక్ వద్ద 2022, ఆగస్టు 27న శిలాఫలకం ఆవిష్కరించారు. కొన్ని వార్డుల్లో పైపులైన్ల ఏర్పాటు నిమిత్తం సిమెంట్ రోడ్లు ధ్వంసం చేశారు. ఆ తర్వాత పనులు చేపట్టకుండా వదిలేశారు. గంపలగూడెం నుంచి నూజివీడు రోడ్డులో 24/10 కిలోమీటరు వద్ద వినగడప కట్టలేరు వాగుపై ఎటువంటి నిధులు మంజూరు కాకపోయిన, స్టేట్ ప్లానింగ్ గ్రాంట్ రూ.25.60 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పేరుతో ఎన్నికల ముందు వైసీపీకి చెందిన నాయకులు 2024, ఫిబ్రవరి 4వ తేదీన హడావిడిగా శిలాఫలకం ఆవిష్కరించారు. పనులు త్వరలో ప్రారంభిస్తారని చెప్పి వెళ్లిపోయారు. దీనిపై అప్పుడే పలు విమర్శలు వచ్చాయి. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల రహదారుల అభివృద్ధిపై నాటి పాలకులు దృష్టి సారించకపోవడంతో గోతులతో నిండి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాటి ప్రభుత్వం శిలాఫలకాలతో మభ్య పెట్టిందని, కూటమి ప్రభుత్వమైనా చొరవ తీసుకుని ఈ పనులు పూర్తి చేయాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.



లక్ష్మీపురంలో ముళ్ల పొదల మధ్యలో విత్తనశుద్ధి కర్మాగారం నిర్మాణ శిలఫలకం

సమాజ పునర్నిర్మాణానికి పాటుపడాలి

- కృష్ణా వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాంజీ
- ఐఈఐ ఏపీ సెంటర్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే



మాట్లాడుతున్న కృష్ణా యూనివర్సిటీ వీసీ రాంజీ

విజయవాడ సిటీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమాజ పునర్నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పాటు పడాలని కృష్ణా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.రాంజీ అన్నారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సెంటర్ (ఐఈఐ-ఏపీఎస్‌సీ) ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే విజయవాడలోని కేఎల్‌రావు భవన్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. వీసీ కె.రాంజీ మాట్లాడుతూ భావితరాలకు ఆదర్శంగా నిలిచే ఆవిష్కరణలవైపు యువత దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆయన జీవితకాలంలో ఎన్నో అద్భుతమైన ఆవిష్కరణలు చేసి దేశ ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. సీఎం చంద్రబాబు అమరావతిలో క్వాంటమ్ టెక్నాలజీని ప్రవేశపెడుతుండటం రాష్ట్రానికే గర్వకారణమన్నారు. మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, ఐఈఐ-ఏపీఎస్‌సీ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంఎల్ఎస్ దేవకుమార్, కార్యదర్శి ఏవీ నరేష్ బాబు, డాక్టర్ సీవీ శ్రీరామ్ పాల్గొన్నారు.

ఆరుగురికి అవార్డుల ప్రదానం

ఇంజనీర్స్ డే సందర్భంగా ఐఈఐ-ఏపీఎస్‌సీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఆరుగురు ఇంజనీర్లకు అవార్డులను ప్రదానం చేశారు. కృష్ణా వర్సిటీ వీసీ కె.రాంజీ, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు ఈ అవార్డులను అందజేశారు. ఉత్తమ ప్రతిభా అవార్డును ప్రొఫెసర్ కె.శ్రీనివాస్ (కమల్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్), డిస్టింగ్విష్ ఇంజనీర్ (ఇండస్ట్రీ) అవార్డును ఎం.సత్యనారాయణ (సీఈవో, ఐజీబీపీ అస్టస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్), డిస్టింగ్విష్ ఉమెన్ ఇంజనీర్ అవార్డును డాక్టర్ సి.శోభాబిందు (జేఎన్‌టీయూఏ), డిస్టింగ్విష్ ఇంజనీర్ (సొసైటీ సర్వీస్) అవార్డును ఎం.శివప్రసాద్ (అదనపు కమిషనర్, పీఆర్ అండ్ ఆర్‌డీ), డిస్టింగ్విష్ ఇంజనీర్ (అకడమిక్) అవార్డును డాక్టర్ వి.శ్రీనివాస నరేష్ (వాసవీ ఇంజనీరింగ్ కాలేజీ, తాడేపల్లిగూడెం), డిస్టింగ్విష్ యంగ్ ఇంజనీర్ అవార్డును డాక్టర్ ఎం.నవీన్‌కుమార్ (వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్శిటీ, పశ్చిమగోదావరి) అందుకున్నారు. ఈ అవార్డులను ప్రొఫెసర్ డాక్టర్ ఆలపాటి సూర్యనారయణ, మలినేని నారాయణప్రసాద్, కె.పద్మజ సమకూర్చారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు కన్నయ్య నాయుడు

ఇంజనీర్లు చరిత్ర నిర్మాతలుగా ఎదగాలి

- ప్రభుత్వ సలహాదారు కన్నయ్య నాయుడు
- సిద్ధార్థలో ఘనంగా ఇంజనీర్స్ డే

కానూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భావి ఇంజనీర్లు చరిత్ర నిర్మాతలుగా ఎదగాలని విశ్రాంత ఇంజనీర్, ప్రభుత్వ సలహాదారు ఈ.ఆర్.ఎన్. కన్నయ్య నాయుడు పిలుపునిచ్చారు. సోమవారం కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ, వీపీపీ సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఘనంగా ఇంజనీర్స్ డే నిర్వహించారు. భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కన్నయ్య నాయుడు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు సైన్స్, గణితం, సామాజిక శాస్త్రం వంటి వాటి నుంచి జ్ఞానాన్ని పొందాలని చెప్పారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన స్వభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. నాగార్జున సాగర్, శ్రీశైలం, తుంగభద్ర ఆనకట్ట వంటి ప్రాజెక్టుల అనుభవాన్ని ఆయన విద్యార్థులతో పంచుకున్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు, పరిశ్రమల అభివృద్ధి, దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్రను వివరించారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు ఎం.రాజయ్య, కార్యదర్శి పి.లక్ష్మణరావు ప్రసంగించారు. కార్యక్రమాల్లో వర్సిటీ వైస్‌చాన్సలర్ పరుచూరి వెంకటేశ్వరరావు, ప్రో వీసీ ఏవీ రత్నప్రసాద్, డైరెక్టర్ బి.పాండురంగారావు, కోఆర్డినేటర్ డాక్టర్ వి.మల్లికార్జున్, డాక్టర్ వెంకట్రావు, వీపీపీ సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

జ్వరంలో యువతి మృతి

పెనుగంచిప్రోలు, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూ జ్వరంతో యువతి మృతి చెందిన ఘటన పెనుగంచిప్రోలు తుఫాన్ కాలనీలో జరిగింది. పెద్ది శ్రీనివాసరావు లక్ష్మీ దంపతుల కుమార్తె రూప(23) బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ వేటలో ఉంది. పది రోజుల క్రితం జ్వరం రావడంతో స్థానిక ఆర్ఎంపీ వద్ద చికిత్స పొందడంతో తగ్గింది. మళ్లీ జ్వరం రావడంతో ఆర్ఎంపీ వైద్యుడు జగ్గయ్యపేటకు వెళ్లమని సలహా ఇచ్చాడు. దీంతో జగ్గయ్యపేటకు, అక్కడి నుంచి ఖమ్మం, అక్కడి నుంచి హైదరాబాద్ తీసుకెళ్లారు. అక్కడ ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయింది. రూప భౌతికాయాన్ని ఆదివారం రాత్రి స్వగృహానికి తీసుకువచ్చారు. రూప భౌతికాయాన్ని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నాగమణి సందర్శించి రూప వైద్యం పొందిన ఆస్పత్రుల ఫైల్స్‌ను తనిఖీ చేశారు. ఎక్కడ డెంగ్యూ పాజిటివ్ లేదని చెప్పారు.

మహిళ మృతదేహంతో ధర్నా

- మృతికి కారణమైన హిజ్రాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- గిరిపురంలో ఉద్రిక్తత.. ఏసీపీ హామీతో ఆందోళన విరమణ
- ఈ కేసులో ఇప్పటికే ఏడుగురు అరెస్టు
- మరో ఐదుగురి కోసం గాలింపు



మృతదేహంతో రోడ్డుపై ఆందోళనకు చేస్తున్న బంధువులు

గుణదల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళ మృతికి కారణమైన హిజ్రాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గిరిపురంలో మృతదేహంతో బంధువులు సోమవారం ఆందోళనకు దిగారు. దీంతో గిరిపురం వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళితే... గిరిపురానికి చెందిన పల్లెపోగు గోపీచంద్ ఓ యువతిని ప్రేమించాడు. ఈ నెల 11వ తేదీన ఆమె తల్లిదండ్రుల వద్దకు వెళ్లి నేను మీ అమ్మాయి ప్రేమించుకున్నాం.. పెళ్లి చేసుకుందామని అనుకుంటున్నామని చెప్పాడు. దీంతో ఆగ్రహించిన ఆమె తండ్రి రాజశేఖర్, మేనమామలు గోపీచంద్‌తో గొడవపడ్డారు. ఆ తర్వాత గోపీచంద్ నివాసం ఉంటున్న ఇంటికి హిజ్రాలను పంపించారు. వారు గోపీచంద్ తల్లి పల్లెపోగు కుమారిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. హిజ్రాల దాడితో మనస్తాపం చెందిన గోపీచంద్ తల్లి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 13వ తేదీన మృతి చెందింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మహిళ మృతికి కారణమైన హిజ్రాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మృతదేహంతో సోమవారం ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న మాచవరం పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఆందోళనకారులు తమకు సరైన న్యాయం చేయలేదని, తమ వాదనను అసలు వినలేదంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది.

బంధువులతో ఏసీపీ చర్చలు

విషయం తెలుసుకున్న సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ సిబ్బందితో గిరిపురం చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. మృతురాలి భర్త పల్లెపోగు కుమార్‌బాబు ఫిర్యాదు మేరకు మొదట ఈ కేసును అనుమానాస్పద మృతిగా నమోదు చేశామని, పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా హత్య కేసుగా మార్చినట్టు చెప్పారు. ఇప్పటికే ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. పరారీలో ఉన్న ఐదుగురు హిజ్రాల కోసం ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టామని చెప్పారు. హిజ్రాలపై చర్యలు తీసుకోకుండా తమకు ఏది చెప్పినా వినేది లేదంటూ ఆందోళనకారులు రోడ్డుపై బైటాయించారు. వైసీపీ సెంట్రల్ నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు గిరిపురం చేరుకుని ఆందోళనకారులకు మద్దతు తెలియజేశారు. దళితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఆందోళన సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా దారి మళ్లించారు. పోలీసులు భారీగా మోహరించారు. అనంతరం ఏసీపీ దామోదర్ మరోమారు చర్చలు జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

టీడీపీ నేత రాంబాబు విగ్రహం ధ్వంసం

- తోటమూలలో వైసీపీ కార్యకర్తల దుశ్చర్య
- ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు



తోటమూల(గంపలగూడెం), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు, గ్రామ మాజీ సర్పంచ్ ఇనుగంటి రాంబాబు విగ్రహాన్ని ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గత నెల తోటమూల రింగ్ సెంటర్‌లో టీడీపీ ఆధ్వర్యంలో రాంబాబు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని ధ్వంసం చేయడంతో రాంబాబు సోదరుడు ఇనుగంటి మధుసూదనరావు ఆదివారం రాత్రే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీకెమెరాలు పరిశీలించగా, వైసీపీకి చెందిన కొంగల వినాయకరావు, మోదుగు శ్రీనివాసరావు, ఇడుపులపాటి రాంబాబు తదితరులు విగ్రహం ధ్వంసం చేసినట్టు గుర్తించారు. సీఐ గిరిబాబు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి నిందితులు ముగ్గురిని అరెస్టు చేసి తిరువూరు తరలించారు. కాగా విగ్రహం ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ సోమవారం తోటమూల సెంటర్‌లో బంద్ పాటించి, నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీసులు, రింగ్ సెంటర్‌లో బందోబస్తు ఏర్పాటు చేశారు.

టీడీపీ నేతల ఆందోళన

రాంబాబు విగ్రహం ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ టీడీపీ శ్రేణులు సోమవారం ఆందోళన నిర్వహించాయి. తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు మాట్లాడుతూ మీ తలచుకుంటే మీరు రోడ్లపై కూడా తిరగలేరని అన్నారు. నాడు మీ అరాచకాలను చూసి ప్రజలు మిమ్ములను అధికారానికి దూరంగా పెట్టారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి కోసమే ఇటువంటివి చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు మానుకొండ రామకృష్ణ, రేగళ్ల వీరారెడ్డి, దిరిశాల వెంకటకృష్ణారావు, వేముల బాలయ్య, ఇనుగంటి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ ఘటనతో వైసీపీకి సంబంధంలేదు : కావూరి

టీడీపీ నాయకుడు ఇనుగంటి రాంబాబు విగ్రహం ధ్వంసం ఘటనతో వైసీపీ సంబంధంలేదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కావూరి వినయ్‌కుమార్ అన్నారు. కొంగల వినాయకరావును పార్టీ నుంచి రెండేళ్ల క్రితమే సస్పెండ్ చేశామని చెప్పారు. ఇడుపులపాటి రాంబాబుకు వైసీపీ సభ్యత్వం లేదని, అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా కాగడ గుర్తుపై పోటీ చేశాడన్నారు. మోదుగు శ్రీనివాసరావు ఎన్నికల సమయంలో టీడీపీలో చేరి, తదుపరి రాంబాబు విగ్రహం పెట్టవద్దని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడని తెలిపారు.

గాంధీకొండ పునర్వైభవానికి కృషి

వన్‌టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వన్‌టౌన్‌లోని గాంధీ కొండకు పునర్వైభవం తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామని గాంధీ హిల్ ఫౌండేషన్ కమిటీ సభ్యుడు, విజయవాడ నగర మాజీ మేయర్ జంధ్యాల శంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1969లో గాంధీ జయంతి సందర్భంగా కొండపైన 56 అడుగుల ఎత్తులో గాంధీస్థూపాన్ని ప్రారంభించారన్నారు. ప్లానిటోరియం, లైబ్రరీ, మ్యూజియం, పిల్లల రైలు, ఉద్యాన వనం వంటివి ఆకట్టుకుంటున్నాయన్నారు. అయితే వివిధ కారణాల వల్ల ఆ సదుపాయాలన్నీ జీర్ణదశకు చేరడంతో డాక్టర్ గాంధీ పి.సి కాజా ఐపీఎస్ అధ్యక్షతన కొత్త కార్యనిర్వాహక కమిటీ ఏర్పడిందన్నారు. కమిటీ ఆధ్వర్యంలో పిల్లల రైలు పునరుద్ధరణ, ఎలివేటర్ ఏర్పాటు, రహదారి విస్తరణ, వారసత్వ ప్రదేశాల అభివృద్ధి వంటి చర్యలు చేపట్టారన్నారు. మహాత్మాగాంధీ పర్యటించిన జ్ఞాపకాలతో సంబంధమున్న ఫొటోలు, వస్తువులు, కథనాలు లేదా ఇతర సమాచారం ఉన్నవారు, వాటిని గాంధీకొండపై మ్యూజియంలో భద్రపరచడానికి అందించాలని కోరారు. వివరాలకు 9440625778, 8985550485 నెంబర్లను సంప్రదించాలన్నారు.

బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఇన్‌చార్జి నూకానమ్మ



వన్‌టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఇన్‌చార్జి యలగాల నూకానమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు యాదవ్‌తో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. నామినేటెడ్ పదవులలోనూ, ప్రజా ప్రతినిధులుగా బీసీలకు ప్రాధాన్యమిస్తున్నందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం 34 శాతం ఉన్న రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిందన్నారు. దీని వల్ల 16,500 మందికి పదవులు పొందలేక పోయారన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ, బీసీ రక్షణ చట్టం అమలుకు కృషి చేయాలని కోరారు. అంతకుముందు బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140 , 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

కోదండ రామాంజనేయస్వామి దేవాలయ భూముల వేలంపాట

నందివాడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నందివాడలోని కోదండ రామాంజనేయ స్వామి దేవాలయ భూములు 10 ఎకరాల 20 సెంట్లు భూమి మూడు సంవత్సరాలకు వేలంపాట సోమవారం నిర్వహించారు. ఎకరానికి 73 వేలు చొప్పున భట్టిపాటి నాగేంద్ర రెడ్డి వేలంపాటలో దక్కించుకున్నట్లు దేవాలయ ఈవో కె.వెంకట లక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేలం పాటలో పాడుకున్న దానికంటే 10 శాతం అధికంగా రెండవ సంవత్సరం కట్టవలసి ఉంటుందన్నారు. గత ప్రభుత్వంలో ఎకరానికి 59 వేలుకాగా, కూటమి ప్రభుత్వంలో ఎకరానికి 73 వేలు రావటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చుట్టూ పక్కల గ్రామాల రైతులు నందివాడ, గ్రామస్థులు పాల్గొన్నారు.



గొల్లేరును సత్కరిస్తున్న ఎన్‌జీవో సభ్యులు

ఉత్తమ ఉపాధ్యాయుడు గొల్లేరుకు సత్కారం

గుడివాడ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : నిరంతర శ్రమతో విద్యార్థుల్లో జిజ్ఞాస కలిగే విధంగా విద్యాబోధన చేస్తున్న ఎన్టీఆర్ జిల్లా, నిడమానూరు మెయిన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొల్లేరు శ్రీనివాస్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా సీఎం చంద్రబాబు చేతుల మీదగా అవార్డును అందుకోవడం అభినందనీయమని ఎన్‌జీవోస్ అసోసియేషన్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు షేక్ ఫరీద్ బాషా తెలిపారు. సోమవారం స్థానిక లక్ష్మీనగర్‌కాలనీలో ఫ్రెండ్స్ ప్రొగ్రెసివ్ ఫ్రంట్ వ్యవస్థాపకుడు డీఆర్‌బీ ప్రసాద్ ఆధ్వర్యంలో అవార్డుగ్రహీత శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు మాధవరావు, నవభారత్ ఖాదీ స్టోర్స్ అధినేత గఫార్, పి.అనీల్‌కుమార్ పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న వెంకట నాగబాబు

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

గుడివాడ : స్థానిక నాగవరప్పాడులోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో పల్లపోతు అభిషిక్త, పల్లపోతు శ్రీరామ్‌ల సహకారంతో సోమవారం విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకృష్ణ ఎంటర్‌ప్రైజెస్ అధినేత పల్లపోతు వెంకటనాగబాబు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ నూర్జహాన్, పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కూటమి ధ్యేయం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) :రైతుల అవసరాలను గుర్తించి వారికి అందుబాటులో ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేయాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం డోకిపర్రు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రీమెన్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. త్రీమెన్ కమిటీ ఛైర్మన్‌గా చింతపల్లి శివారెడ్డి, డైరెక్టర్లుగా చిలక నాగరాజు, డొక్కు రాంబాబులచే ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ వీరమాచనేని శివప్రసాద్, డీసీ వైస్‌ఛైర్మన్ వీరమాచనేని నాగజయరామ్, జనసేన గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ పొట్లూరి రవికుమార్, గుడివాడ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ వల్లభనేని వెంకట్రావు, తెల్లాకుల నాగలక్ష్మి, పద్మజ, పుష్పావతి, సుబ్బారెడ్డి, టీఎన్‌టీయూసీ సెక్రటరీ వి.రత్నాకర్ పాల్గొన్నారు.

గుడివాడ రూరల్: రైతులు ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయం సాగు చేసి అధిక లాభాలు పొందాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం రామన్నపూడి ఆర్ఎస్‌కే పరిధిలో ఉన్న తట్టివర్రులో పది లక్షల విలువ చేసే డ్రోన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. డ్రోన్ సహాయంతో ఎకరం వరి పొలంలో రసాయన ఎరువులు పిచికారి చేశారు. ఎకరం పొలంలో ఆరు నిముషాల్లో రసాయనిక ఎరువులు వరి పైరుపై పిచికారి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదుగురు రైతులు 80 శాతం సబ్సిడీపై డ్రోన్ తీసుకోవటం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా వ్యవసాయం చేయటానికి రైతులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.



త్రీమెన్ కమిటీతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ మార్కెట్ యార్డు ఛైర్మన్ చాట్రగడ్డ రవి కుమార్, వైస్ ఛైర్మన్ గొరిపర్తి సుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ, తట్టివర్రు సర్పంచ్ నిర్మలాకుమారి, కైలా కాళిదాసు, రామన్నపూడి మాజీ సర్పంచ్ గోపాలకృష్ణ, పీఏసీఎస్ ఛైర్మన్ రామకృష్ణ, సాంబయ్య, వెంకటగిరి, వంశీకృష్ణ, జనార్ధనరావు పాల్గొన్నారు.



సమస్యలను వింటున్న మున్సిపల్ కమిషనర్ మనోహర్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

●మున్సిపల్ కమిషనర్ ఎస్ మనోహర్

గుడివాడ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ మనోహర్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి గ్రీవెన్స్ స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కర వేదికలో మొత్తం ఎనిమిది సమస్యలను ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు, అకౌంట్స్ ఆఫీసర్ జి.టి నాయుడు, మున్సిపల్ ఇంజినీర్ ఎ.ఎస్.ఎన్ ప్రసాద్, మేనేజర్ బి.నిర్మల కుమారి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వి.యేసుబాబు, మెప్మా సీఎంఎం బసవేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం

పెదపారుపూడి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆహారాన్ని పండిస్తూ ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణగా పేరుగాంచేందుకు రైతులు చేస్తున్న కృషి ఎవరూ మరిచిపోలేనిదని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. రైతులకు సకాలంలో యూరియా అందించటంలోనూ, సాగుకు అవసరమైన నీరు అందించటంలోనూ రాష్ట్ర ప్రభుత్వం చూపిన చొరవకు కృతజ్ఞతగా వెంట్రప్రగడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగు, మురుగు కాలువలను అభివృద్ధిపర్చటంతో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సక్రమంగా సాగు నడుస్తోందన్నారు. అలాగే మండల పరిధిలోని మోపర్రు వద్ద కాలువకు పడిన గండ్లను పూడ్చటంతోపాటు ఎస్కలేటర్లను ఉపయోగించి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేశామన్నారు. ప్రాథమిక సహకార సంఘాలకు త్రీమెన్ కమిటీలను ఏర్పాటు చేసి వారి ద్వారా రైతులకు అవసరమైన రుణాలు సకాలంలో అదిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కూచిపూడి వెంకట సుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, మసిముక్కు రాంబాబు, పార్టీ నాయకులు సూరపనేని వెంకట సత్యనారాయణ, పునుగోటి సత్యనారాయణ, పాల్గొన్నారు.



చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

రజకులపై దాడులను అరికట్టాలి

● చిక్కవరపు వెంకటరెడ్డయ్య

గుడివాడ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రజక సంఘీయులపై జరుగుతున్న దాడులను అరికడుతూ, రజకులకు రక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిక్కవరపు వెంకటరెడ్డయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జగన్నాథపురంలోని పట్టణ రజక సంఘం అధ్యక్షుడు నైనవరపు శేషుబాబు స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రజక వర్గాలపై జరుగుతున్న దమనకాండను ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నూతన ఆర్థిక విధానాలతో రజక వృత్తిదారులు ఉపాధి కోల్పోయి కూలీలుగా మారాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అన్ని ప్రభుత్వ యంత్రాంగాల్లో దోబీ పోస్టులను రజకులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. రజకులను చులకనగా చేస్తూ దాడులు చేస్తే సహించేది లేదని, విప్లవ పోరాట యోధురాలు ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఇటీవల మచిలీపట్నంలో గిరిధర్ అనే రజకునిపై దాడులు చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్త అందోళన తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు పెనుమూడి నాగేశ్వరరావు, ఓలేటి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు ఉమా శ్రీనివాసరావు, పోలుకొండ నాగబాబు, సీహెచ్ శంకరప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరెడ్డయ్య

రైతులకు పంట నమోదు తప్పనిసరి

● వ్యవసాయ అధికారి వి. శివనాగరాణి

పామర్రు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఈనెల ఆఖరివరకు కొనసాగే పంట నమోదు ప్రక్రియకు రైతులు సహకరించి సాగు వివరాలు నమోదు చేసుకోవడం తప్పనిసరి అని గ్రహించాలని పామర్రు మండల వ్యవసాయశాఖ అధికారిణి వి. శివనాగరాణి అన్నారు. మండల పరిధిలో పలు గ్రామాల్లో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదును సోమవారం ఆమె అకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులనుద్దేశించి మాట్లాడుత ఈక్రాప్ నమోదుతోనే ఖరిఫ్‌లో సాగుచేసిన పంటను రైతులు అమ్ముకోవాల్సి ఉంటుందని గ్రహించాలన్నారు. దీంతోపాటు ప్రకృతి వైపరీత్యాలు వచ్చిన సమయంలో పంట నష్టం పరిహారం పొందడం కోసం పంటనమోదుతోనే ముడిపడి ఉందన్న విషయం పట్ల రైతుల్లో అవగాహన కల్పించారు. పంట నమోదు వల్ల జరిగే ఇతర ప్రయోజనాలు వివరించారు. అయా గ్రామాల వీఏఏ పలువురు రైతులు, కౌలుదారులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న శివనాగరాణి

బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

● ఈవీ రామారావు

కూచిపూడి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈవీ రామారావు పేర్కొన్నారు. ఏపీటీఎఫ్ తలపెట్టిన నిరసన ప్రదర్శనలు 5వ రోజుకు చేరుకున్నాయి. మొవ్వ పాత తాలూకా కేంద్రం ఎదుట నిరసన కార్యక్రమాన్ని మొవ్వ, చల్లపల్లి, ఘంటసాల ఉపాధ్యాయులు, కార్యకర్తలు పాల్గొని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో గడిపే సమయమంతా విద్యార్థుల బోధనకే వినియోగించే విధంగా ఉపాధ్యాయులకు స్వేచ్ఛనివ్వాలన్నారు. 4 డీఏలను తక్షణమే విడుదల చేయాలన్నారు. సీపీఎస్ రద్దు చేయాలని, మెమో నెంబరు 57ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.నాగరాజు, ఎన్.శివలక్ష్మి, బి.మాణిక్యాలరావు, కిషోర్, శ్రీనివాసరావు, శ్రీధర్, లక్ష్మేశ్వరరావు, లాల్, నాయకులు ఆలీ, శ్యామ్ కుమార్, సోమేశ్వరమ్మ, పద్మ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న ఏపీటీఎఫ్ నేతలు

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు

తోట్లవల్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వల్లూరుపాలెంలో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో తొమ్మిదిమందికి రూ 2,92,213 సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పంపిణీ చేశారు. వల్లూరుపాలెం, భద్రిరాజుపాలెం, తోట్లవల్లూరు, కనకవల్లి, గరికపర్రు, యాకమూరు గ్రామాలకు చెందిన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందచేశారు.

అనంతరం వైసీపీకి చెందిన 13 కుటుంబాలు టీడీపీలో కుమార్ రాజా సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, పీఏసీఎస్ ఛైర్మన్ ఆచంట కోటిబాబు, చింతపల్లి వెంకటేశ్వరరావు, చాగంటి తిమ్మారెడ్డి, ఈడే వాసు తదితరులు పాల్గొన్నారు.



వల్లూరుపాలెంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

నూతన ధర్మకర్తల మండలి నియామకం

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయానికి నూతన ధర్మకర్తల మండలిని ప్రభుత్వం సోమవారం నియమిస్తూ ప్రకటన విడుదల చేసిందని కొండాలమ్మ అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు కొండలమ్మ ఆలయానికి 10 మంది ధర్మకర్తలను నియమించారు. ఈడే వెంకట విష్ణుమోహనరావు, తూము రాజ్యలక్ష్మి, గుడ్లవల్లేటి వాణి, ముగం ఆంజనేయులు, కళ్లేపల్లి సుగుణశేఖర్, మన్నెం వీరనాగేంద్రరావు, వడ్లమూడి రవీంద్రబాబు, పెద్దుబోయిన శ్యామలా దేవి, నూతులపాటి లక్ష్మీపావని, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా అర్చకుడు రుద్రపాటి శరత్‌చంద్ర శివ సంతోష్ శర్మలను నియమించారని కొండలరావు తెలిపారు. కాగా నూతన ధర్మకర్తలచే ఈ నెల 17వ తేదీ బుధవారం ఉదయం ప్రమాణస్వీకారం నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. అనంతరం ఛైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నామని తెలిపారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పెదపారుపూడి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. యలమర్రులో పశుసంవర్ధక శాఖ వారు నిర్వహించే ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్.చిన్న నరసింహులు , గుడ్లవల్లేరు పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ సి.శ్రీనివాస్ , యలమర్రు ఉపసర్పంచ్ సూరపనేని సత్యనారాయణ, డా.జి.వి.నరసింహారావు మండల పశువైద్యులు డా.ఎన్.రామలక్ష్మీ, డా.ఎస్.కవిత, నందివాడ మండల పశువైద్యులు డా.హెచ్.జయంత్, డా.జి.రామకృష్ణ, సర్పంచ్ కొల్లూరి అనూష, మండల టీడీపీ అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి రాంబాబు, పాల్గొన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న హనుమంతరావు

గుడివాడ రూరల్ : సోమవారం మోటూరు, బొమ్ములూరు గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు పశువులకు వేశారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద 4 నెలలు దాటిన ప్రతి పశువుకూ టీకాలు వేయించారు. గాలికుంటు వ్యాధి వల్ల రైతులకు అపార నష్టం వాటిల్లుతుందని మండల పశువైద్యాధికారి ఉన్నం హనుమంతరావు తెలిపారు.

ముగిసిన గుడివాడ జేసీఐ వారోత్సవాలు

గుడివాడ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఏడాదీ సెప్టెంబరు 9-15 తేదీల్లో నిర్వహించే జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనేషల్ (జేసీఐ) వారోత్సవాలు ఈసారి ప్రిజమ్-110గా ప్రత్యేకతను సంతరించుకుంది. సోమవారం స్థానిక జేసీఐ భవన్‌లో వారాంతర కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసి గ్రేట్ డే వేడుకలను నిర్వహించారు. చార్టర్డ్ అకౌంటెంట్ మనోజ్‌ను అవుట్‌స్టాండింగ్ యంగ్ పర్సన్‌గా, జేసీ సలీమ్(ఎంట్రప్రెన్యూర్)ను కమలపత్ర అవార్డులతో సత్కరించారు. అదనంగా పోలీస్ విభాగంలో నాగవిశ్వనాథ్, కానిస్టేబుల్ రాము, ఫైర్ విభాగంలో యోగానంద్, పోస్టల్ విభాగంలో శిరీషలను సైలెంట్ స్టార్స్ అవార్డులను అందజేశారు. బ్యాడ్మింటన్ రన్నరప్‌గా నిలిచిన ఉద్యోగ్‌కు పురస్కారం అందజేశారు. జోన్ డైరెక్టర్ జేసీ లక్కం రవీంద్ర, లక్కీజైన్, వంశీ, మోనీష్, అన్నం చిన్న వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

పెండింగ్ జీతాలు చెల్లించాలి

గుడివాడ : పారిశుధ్య కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకుడు గూడపాటి ప్రకాష్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గుడివాడ ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మెడికల్ శాఖలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు కాంట్రాక్టర్ గత నాలుగు నెలలుగా జీతాలు చెల్లించడం లేదన్నారు. దీనివల్ల పీఎఫ్, ఈఎస్ఐలు సరైన సమయంలో కట్టలేక పారిశుధ్య కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆసుపత్రి సిబ్బందికి ఐదు నెలలుగా జీతాలు చెల్లించకుండా కాంట్రాక్టర్ కార్మికులను ఇబ్బందిపెడుతున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతలూరి సత్యనారాయణ, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు విజయలక్ష్మీ, రాణి, నాగాంజనేయులు, కార్మికులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు తగదు : కైలే

పామర్రు :మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు పేర్నినానిపై అధికార పార్టీ ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అసత్య ఆరోపణలు చేయడం తగదని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్య ఇంజనీర్లకు ఆదర్శప్రాయుడు

● రాజా వీఎల్ఎన్ శ్రీధర్



జ్యోతి వెలిగిస్తున్న ఇస్రో శాస్త్రవేత్త శ్రీధర్

గుడివాడ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : విశ్వేశ్వరయ్య నేటి ప్రతి యువ ఇంజనీర్‌కు ఆదర్శప్రాయులని ఇస్రో శాస్త్రవేత్త రాజా వీఎల్ఎన్ శ్రీధర్ కొనియాడారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని 58వ ఇంజనీర్స్ డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత విశ్వేశ్వరయ్య చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శాస్త్రవేత్త శ్రీధర్‌ను ఘనంగా సత్కరించారు. విద్యార్థుల పోస్టర్ ప్రజెంటేషన్, సైన్స్ ఎక్స్పో ఆకట్టుకుంది. కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య, అకడమిక్ డైరెక్టర్ బి.కల్యాణ్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ ప్రభాకర్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంజనీర్స్ డే సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు, ఇంజనీరింగ్ గోల్డ్ మెడలిస్ట్ యలవర్తి శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. క్లబ్ రీజనల్ ఛైర్మన్ విస్సంశెట్టి కృష్ణకిషోర్, గుడివాడ అధ్యక్షుడు గుడివాడ వేణుగోపాలస్వామి, కార్యదర్శి సతీష్, కోశాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంజనీర్స్ డే వేడుకల్లో భాగంగా జ్యోతి పాలిటెక్నిక్ కళాశాల కరస్పాండెంట్ ఎస్.వి రమణను ఘనంగా సత్కరించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షకార్యదర్శులు ఎల్.ఆర్.కె ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, కోశాధికారి పర్వతనేని కృష్ణప్రసాద్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామారావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్ పాల్గొన్నారు.

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గుడివాడ లయన్స్ క్లబ్ ప్రగతి ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీర్ ప్రసాద్, ఇంజనీర్లు శరత్‌చంద్ర, శివాజీలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మాదాల సురేష్, కార్యదర్శి పి.కేశవరావు, సభ్యులు ఉపద్రష్ట రాంబాబు, కట్టా రవీంద్ర, రామధేను వేణుబాబు, పోలవరపు శ్రీనివాసరావు, సనకా సుబ్బారావు, శేషగిరిరావు, మురళీధర్, వీరశేఖర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో సోమవారం ఇంజనీర్స్ డే ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్ఆర్ గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల వేదికగా ఇంజనీరింగ్ అధ్యాపకులు, పాలిటెక్నిక్ అధ్యాపకులు 25 మందిని ఘనంగా సన్మానించారు. తొలుత భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజానికి ఇంజనీర్లు చేస్తున్న సేవను పలువురు కొనియాడారు. పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ నిమ్మగడ్డ రాజశేఖర్, ఎస్ఆర్‌జీఈసీ డైరెక్టర్ డాక్టర్ పి. సిద్దయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్, వైస్‌ప్రిన్సిపాల్స్ పి.కోదండరామారావు, ఎంఆర్‌సీహెచ్ శాస్త్రి, డైరెక్టర్లు డాక్టర్ జీఎస్ఎన్ఆర్‌వీ ప్రసాద్, డాక్టర్ ఎం.కామరాజు, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ శాఖల హెచ్‌వోడీలను సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు మేరుగు పెరుమాళ్లరావు, సెక్రటరీ కల్యాణపు నవాబు, కోశాధికారి పెంటపాటి చిట్టిబాబు, జోన్‌ఛైర్‌పర్సన్ నిమ్మగడ్డ శశికళ, జిల్లాలయన్స్ మాజీ గవర్నర్ వైవీసీ ప్రసాద్, ఇంజనీరింగ్ కళాశాల సహకార్యదర్శి రామకృష్ణ, గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ రవికుమార్, మోహనరావు పాల్గొన్నారు.



ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులను సన్మానిస్తున్న లయన్స్ సభ్యులు

మచిలీపట్నం

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

పెడన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా అనంతలక్ష్మి

మచిలీపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పెడన వ్యవసాయ కమిటీ చైర్‌పర్సన్‌గా భీముని అనంత లక్ష్మీని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. కమిటీ వైస్‌చైర్మన్‌గా పామర్తి వీరవెంకటరావు, సభ్యులుగా ఎం.కలీలుల్లా, తమ్మన భీమయ్య, శిరివేళ్ల వెంకటేశ్వరమ్మ, నారగాని భవానీ, అట్లూరి శ్రీను, గరికముక్కు నాగమణి, తుమ్మా సుబ్బారావు, పుప్పాల భద్రయ్య, శాయన సోమయ్య, కనపర్తి అంజలి, గంధం దీనబాబు, ఇదల పాటి వెంకటలక్ష్మీ, మద్దినేని నాగమణిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మార్కెట్ యార్డ్ గౌరవ అధ్యక్షుడిగా ఉంటారు.



ప్రభుత్వాసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న శానిటరీ వర్కర్లు

పెండింగ్ జీతాలు చెల్లించాలని శానిటరీ వర్కర్ల ధర్నా

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నాలుగు నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలంటూ జిల్లా సర్వజన ఆసుపత్రి శానిటరీ వర్కర్లు సోమవారం ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ నాయకుడు లింగం ఫిలిప్, నియోజకవర్గ కార్యదర్శి వై లక్ష్మణరావు, కాంట్రాక్టు ఉద్యోగుల సంఘ నాయకులు ఫణీంద్ర, జోసఫ్, లక్ష్మీ, దుర్గా, ధనలక్ష్మి, అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు. లింగం ఫిలిఫ్ మాట్లాడుతూ, సిబ్బందికి కాంట్రాక్టర్ జీతాలు ఇవ్వడం లేదని, పీఎఫ్, ఈఎస్‌ఐలు సకాలంలో చెల్లించడం లేదని అన్నారు. సూపర్‌వైజర్లు సైతం కార్మికులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు.

సుధాకర్‌రెడ్డి దంపతులకు ఘన సత్కారం



మోపిదేవి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రావి దుర్గా సుధాకర్ రెడ్డి దంపతుల సేవా నిరతి ఆదర్శనీయమని ఎంపీపీ దుర్గావాణి, జడ్పీటీసీ సభ్యుడు మల్లిఖార్జునరావు అన్నారు. దుర్గా సుధాకర్‌రెడ్డి దంపతులు పెదకళ్లేపల్లిలోని మోడల్ ప్రైమరీ పాఠశాలలో రూ.60 వేల వితరణతో మంచినీటి ట్యాంక్ ఆధునీకరణ, డ్రైనేజీ వసతి కల్పించగా గ్రామసర్పంచ్ అరజా సంధ్యారాణితో కలిసి ప్రారంభించారు. దుర్గా సుధాకర్‌రెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. హెచ్ఎం కె.మోహనరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు అరజా ఆషాదేవి, ఎస్ఎంసీ ఛైర్మన్ నాగజ్యోతి, ఎంఈవోలు జి.ఎస్.బి.గోపాల్, ఏవి.రమణ, విశ్రాంత ఉపాధ్యాయులు కంఠమనేని కుటుంబరావు, నాగేశ్వరరావు, అరజా వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు రావి నాగేశ్వరరావు, అరజా కిరణ్‌కాంత్ పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఉద్యానవన శాఖ అధికారి జె.జ్యోతి



గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మండలి



గోసంరక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేడీ చిన్న నరసింహులు

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

చల్లపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారిణి జె.జ్యోతి అన్నారు. వరికి ప్రత్యామ్నాయ పంటలపై చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో రైతు నాయకులు హనుమానుల సురేంద్రనాధ్ బెనర్జీ, ఎన్నారై మండవ శేషగిరిరావు ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు జరిగింది.

ఉద్యానవన అధికారిణి జ్యోతి మాట్లాడుతూ, వరిపొలంలో ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసి ఎందరో రైతు లు విజయాలు సాధించారని వివరించారు. వరిపంట సాగుచేసే రైతులు గట్లను పెద్దవిగా చేసుకుని వాటిపై కొబ్బరి, కంది, మునగ, డ్రాగన్ ఫ్రూట్, కూరగాయాలు వంటివి సాగుచేయటం వల్ల అధిక లాభాలు సాధించే అవకాశం ఉందని వివరించారు. వక్క మొక్కలు నాటి అంతరపంటగా కోకో, మిరియాలు పండించటం ద్వారా లాభాలు గడించవచ్చన్నారు. ఉండవల్లి ఆగ్రోఫామ్ జీఎం బి.హరికృష్ణ మాట్లాడుతూ, వరి సాగు చేసుకుంటూనే పామాయిల్ సాగు చేయవచ్చన్నారు. రైతులు పామాయిల్‌ను ప్రధాన పంటగా రైతులు ఒక బృందంగా ఏర్పడి సాగు చేస్తే అధిక ప్రయోజనాలు ఉంటాయన్నారు. విశ్రాంత ఆర్డీవో నాదెళ్ల శివరామకృష్ణ మాట్లాడుతూ, ఇతర దేశాలలో ఉంటూ కూడా మన ప్రాంతాన్ని వృద్ధిలోకి తీసుకురావాలనే తపనతో ఎన్నారై మండవ శేషగిరిరావు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. మరికొంత మందితో కలిసి ఫ్లోరిడాలో కూడా వ్యవసాయం చేస్తున్న ఘనత శేషగిరిరావుకే దక్కుతుందన్నారు. సదస్సులో రైతు నాయకులు గుత్తికొండ రాము, మిక్కిలినేని మధు, దోనేపూడి గోపీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

మోదుమూడిలో..

అవనిగడ్డ రూరల్ : మోదుమూడి రైతులకు అవనిగడ్డ ఉద్యాన అధికారి ఎస్.రమేష్ పండ్ల తోటలు, కూరగాయలు, పసుపు, ఆయిల్ పామ్ పంటల సాగు, సబ్సిడీ వివరాలు వివరించారు. ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. తైవాన్ స్ప్రేయర్లు, రోటోవటర్, పవర్ టిల్లర్, పవర్ వీడర్, ఇతర వ్యవసాయ పరికరాలు 50 శాతం సబ్సిడీతో అందిస్తున్నామని తెలిపారు.

గోవుల సంరక్షణపై శ్రద్ధ చూపాలి

మోపిదేవి : గోశాలలో ఉన్న ఆవులను నిరంతరం పర్యవేక్షిస్తూ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా జంతు సంపద సం యుక్త సంచాలకులు ఎం.చిన్ననరసింహులు తెలిపారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలోని గోశాలను మండల పశువైద్యాధికారి డాక్టర్ నందకిషోర్‌తో కలసి పరిశీలించారు. ప్రస్తుతం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన గాలికుంటు వ్యాధి వ్యాక్సినేషన్ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఆవులకు వ్యాక్సినేషన్ వేశారు. గో సంరక్షణకు తీసుకోవాల్సిన మెలకువలను సిబ్బందికి ఆయన వివరించారు. ఆలయ పర్యవేక్షకులు మధుసూదనరావు, పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ సేవలు సద్వినియోగం చేసుకోండి

అవనిగడ్డ : పశుసంవర్ధక శాఖ సేవలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల మాసోత్సవాలను ఆయన ప్రారంభించారు. గ్రామసర్పంచ్ పండ్రాజు లంకమ్మ ప్రసాద్, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగభూషణ బాబు, అసిస్టెంట్ డైరెక్టర్ బొండు సాంబశివరావు, మండల పశువైద్యాధికారి డాక్టర్ షఫి, మౌనిష, మాజీ సర్పంచ్‌లు రేపల్లె వీరరాఘవయ్య, కొండవీటి మస్తానరావు, యక్కటి నాగరాజు పాల్గొన్నారు. ఘంటసాల : పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ దేవిన హరీష్ అన్నారు. ఘంటసాల, చినకళ్లేపల్లి గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు 82 పశువులకు వేశారు.





పోటీలను ప్రారంభిస్తున్న ఘంటసాల ఎంపీడీవో శ్రీనివాసచంద్, కోడూరు ఎస్సై చాణిక్య

క్రీడలతో మానసికోల్లాసం

ఘంటసాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస చంద్ పేర్కొన్నారు. మండల స్థాయి క్రీడా పోటీలను సోమవారం ఘంటసాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆయన ప్రారంభించారు. 150 మంది బాలబాలికలు పాల్గొన్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్ బాణావత్ వెంకటేశ్వరమ్మ, ఎంఈవో -2 ఎండి.మోమిన్, హెచ్ఎం శ్రీరంగవల్లి, ఉపాధ్యాయులు పాల్గొనగా, పిడిలు వివి.పిచ్చేశ్వరరావు, రవి, రామారావు, వెంకటేశ్వరరావు, గోవిందరాజు క్రీడా పోటీలను పర్యవేక్షించారు. **నాగాయలంక** : మండల స్థాయి ఆటల పోటీలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ కైతేపల్లి అంకాలు ప్రారంభించారు. బడే వెంకటేశ్వరరావు, గాజుల లక్ష్మీ ప్రసాద్, రేపల్లె శ్రీధర్, టి.ఎస్.రత్నకుమారి, ఎంఈవోలు సనకా శ్రీకాంత్, ఏ.రామారావు, ప్రధానోపాధ్యాయులు ఏ.సత్యనారాయణ, వక్కపట్ల లీలావతి తదితరులు పాల్గొన్నారు. **కోడూరు** : స్వతంత్రపురం పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను హెచ్ఎం మెండు ఉమామహేశ్వరరావు నేతృత్వంలో ఎస్సై కె.చాణిక్య, ఎంఈవో టి.వి.ఎం.రామదాసు, పీసీ ఛైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యులు తిమ్మన వెంకట నాంచారయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు పూతబోయిన కరుణ కుమార్, ఎస్ఎంసీ కమిటీ ఛైర్మన్ గజేంద్రరావు, వార్డుసభ్యుడు అర్జునరావు పాల్గొన్నారు.







మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా జడ్పీ సెంటర్, వాసవీ వృద్ధాశ్రమం, ఈడేపల్లి గ్రంథాలయంలో ఇంజనీర్లను సత్కరిస్తున్న ప్రముఖులు

ఇంజనీర్స్ డే సందర్భంగా ఇంజనీరింగ్ ప్రముఖులకు సత్కారం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ సెంటర్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద ఇంజనీర్స్ డే సోమవారం నిర్వహించారు. ఇంజనీర్లు ఆర్‌విఎస్ మురళీధరరావు, కోస్తా మురళీకృష్ణ, సుబ్బారావు, శాయన గోపాల్, జల్దు మురళి, తదితరులను కార్పొరేటర్ పినిశెట్టి నాగఛాయాదేవి తదితరులు ఘనంగా సన్మానించారు. ఈడేపల్లి శాఖా గ్రంథాలయంలో ఇంజనీర్లు అగ్నిహోత్రం యోగానంద, ఆర్‌విఎస్ మురళీధర్‌లను సత్కరించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పి.వి.ఫణికుమార్, వెంకటేశ్వరమ్మ, శంకర్ తదితరులు పాల్గొన్నారు. సర్కారుతోటలోని శ్రీ వాసవి వృద్ధాశ్రమంలో ఇంజనీర్ల బృందం వ్యాసం గోపాల్ ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు వ్యాసం గోపాల్, కోస్తా మురళీకృష్ణ, ఆర్‌విఎస్ మురళీధర్, టి శ్రీనివాస్, శ్రీపతి ప్రసాద్, జివి సుబ్బారావు, తదితరులను వృద్ధాశ్రమం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. వృద్ధాశ్రమం అధ్యక్షుడు పులపర్తి నటరాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ ఉడత్తు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సన్నిధి నాగసాయి శ్రీనివాస్ పాల్గొన్నారు. **పెడన రూరల్** : ఇంజనీర్స్ డే వేడుకలు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. భారతరత్న డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ట్రాన్స్‌కో ఏఈఈ డీ మాణిక్యాలరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, భావి ఇంజనీర్లు మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి నడుంబిగించాలన్నారు. ఇంజనీరింగ్ అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ కాకి కుమార్‌బాబు, ఎగ్జిక్యూటివ్‌డైరెక్టర్ దోసపాటి బాబా, ప్రిన్సిపాల్ బిఆర్ఎస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డిరాజారమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మండల సమావేశం నేడు

మోపిదేవి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 16వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో స్వర్ణభారతి తెలిపారు. ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి ఆయా శాఖల మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాల్సిందిగా కోరారు.

రామలింగేశ్వరస్వామికి విశేష పూజలు

నాగాయలంక, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామికి జన్మనక్షత్రం ఆర్ద్ర సందర్భంగా 1008 కలువ పుష్పాలతో స్వామివారికి విశేషంగా అలంకరణ ఏర్పాటు చేశారు. 150 కిలోల పంచదారతో అర్చకులు కౌశిక్ అభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలా కృష్ణ ప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

లక్ష్మీదేవికి అభిషేకాలు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో సోమవారం లక్ష్మీదేవికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ, కార్యదర్శి మోటమర్రి బాబ్జాప్రసాద్, భైసాని హయగ్రీరావు, సామా లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

గీతామందిరంలో జన్మాష్టమి వేడుకలు

అవనిగడ్డ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గీతా మందిరంలో చిన్నజీయర్ స్వామి ఆదేశాల మేరకు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ధర్మకర్తలు యర్రంశెట్టి హరిబాబు దంపతులు విశిష్ట అభిషేకాలు చేశారు. అర్చక స్వాములు నరసింహమూర్తి, సూర్య ఆధ్వర్యంలో స్వామివారికి అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. సామూహిక విష్ణుసహస్ర నామ పారాయణం గావించారు.

దసరా మహోత్సవాలు 22 నుంచి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 22 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ చైర్మన్ తమ్మన రాధాకృష్ణమూర్తి తెలిపారు. ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. సురేష్‌బాబు, వాసు, చిట్టిబాబు, సాయిచరణ్, చేబ్రోలు బాబీ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెడన రూరల్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పులతో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేవేంద్రపాలెం ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి దిలీప్‌కుమార్ అన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులతో దగ్గు, జలుబుతో ప్రారంభమై జ్వరాలకు దారి తీస్తుందన్నారు. తేలిక పాటి దగ్గు జలుబే కదా అని అశ్రద్ధ చేయకుండా ఎఎన్ఎంలు, ఆశా వర్కర్ల ద్వారా తగిన చికిత్స చేయించుకోవాలన్నారు. ప్రజలను అప్రమత్తం చేసేందుకు చెన్నూరు, పెనుమల్లి, నందిగం గ్రామాల్లో శిబిరాలు నిర్వహించామన్నారు. అన్నిరకాల రక్తపరీక్షలు నిర్వహిస్తామన్నారు. డెంగ్యూ కేసులు లేవన్నారు. ప్రతిరోజు 50 మందికి వైద్యసేవలందిస్తున్నామన్నారు.

ప్రతిరోజూ గుడ్డు తినాలి

ప్రతిరోజు గుడ్డు తినటం వలన మంచి ఆరోగ్యంతో ధృడంగా ఉంటారని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. దేవరపల్లి గ్రామానికి చెందిన పంతగాని సుహసినికి నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (ఎన్ఇసీసీ) భాగస్వామ్యంతో రూ.50 వేలు విలువ చేసే ఎగ్‌కార్ట్ (వాహనం)ను ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అందజేశారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, శీరం ప్రసాద్, యక్కల శ్యామలయ్య, తహసీల్దార్ కె అనిల్ కుమార్, ఎంపీడీవో అరుణకుమారి, వెలుగు ఏపీఎం శ్రీదేవి, సీసీలు వెంకటేశ్వర్లు, తులసిబాల పాల్గొన్నారు.

బ్యాగులు, పుస్తకాల వితరణ

నాగాయలంక, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్య తోనే విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుంటారని స్పిక్ గ్రీన్ స్టార్ ఫెర్టిలైజర్స్ మార్కెటింగ్ అధికారి మహమ్మద్ జమాల్ నూర్ తెలిపారు. ఉమామహేశ్వర ఫెర్టిలైజర్స్ అధినేత ఉప్పల శ్రీరామ్ భూపాల్ సింగ్ సహకారాలతో స్పిక్ గ్రీన్ స్టార్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ సౌజన్యంతో సోమవారం నాలి యూపీ పాఠశాలలోని 80 మంది విద్యార్థులకు 25 వేలు విలువ గల బ్యాగులు, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు చేకూరి నిర్మల, చంద్రశేఖర్, జయచంద్ర, పెదసింగు నాగేంద్రబాబు, టాన్యా పాల్గొనగా, ఉప్పల భూపాల్ సింగ్ తదితరులు పర్యవేక్షించారు.

ఎంవీకేకు కూటమి నేతలు నివాళి

నాగాయలంక, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శత జయంతి వేడుకలను పురస్కరించుకొని సోమవారం 43వ రోజున కూటమి నేతలు మండలి వెంకట కృష్ణారావుకు ఘన నివాళులర్పించారు. తెలుగు మహిళా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, మండల టీడీపీ అధ్యక్షులు మెండు లక్ష్మణరావు, మండలి ఉదయభాస్కర్, గుడివాక శివరావు, గుడివాక శివాజీ, చన్నగిరి లతామోహన్, తోట శ్రీనివాసరావు, ముమ్మారెడ్డి శ్రీనివాసరావు, తాడేపల్లి వెంకట పాపారావు, మాదివాడ అర్జునరావు, తోట మానస, తానంకి చంటి, బొంతు ప్రకాష్, తలశిల శివరామకృష్ణ, షేక్ జానీ, తలశిల శివశంకర్, భోగాది సతీష్, తోట రత్నారావు, బండ్రెడ్డి బోసు పాల్గొని నివాళులర్పించారు.

కృష్ణానదిలో యువకుడి గల్లంతు

కోడూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : లింగారెడ్డిపాలెం యువకుడు కృష్ణా నదిలో గల్లంతైన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది. గ్రామానికి చెందిన కంతేటి నాగ వెంకట శ్రీనివాసరావు (28) ఆదివారం సాయంత్రం ఉల్లిపాలెం బహిర్భూమికి అని వెళ్లి ఎంతసేపటికీ తిరిగి రాలేదు. బంధువులు గాలింపు చర్యలు చేపట్టి ఉల్లిపాలెం బ్రిడ్జి వద్దకు వెళ్లగా శ్రీనివాసరావు ద్విచక్ర వాహనం, చెప్పులు కనిపించాయని, కిందికి దిగి చూడగా శ్రీనివాసరావు నదిలో కొట్టుకుపోతూ కనిపించాడని తండ్రి నాగ బసవయ్య ఫిర్యాదు చేశారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై చాణిక్య తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

కోడూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యువకుడు ఎలుకల నివారణ బిళ్లలు తిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎనిమిదో వార్డులో జరిగింది. రాజబోయిన సోమేశ్వరరావు (35) అనారోగ్యానికి గురై ఆహారం తీసుకోవటం కష్టంగా ఉండడంతో జీవితంపై విరక్తి చెందిన ఆదివారం ఎలుకల నివారణ మందు తిన్నాడు. కుటుంబ సభ్యులు అవనిగడ్డ ఆసుపత్రిలో ప్రాథమిక వైద్యం చేయించి, మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్తుండగా సోమవారం మృతి చెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సై చాణిక్య దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే మండలి పరామర్శ

చల్లపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం చల్లపల్లిలో పలువురిని పరామర్శించారు. గణేష్ ప్రెస్ అధినేత వక్కలగడ్డ రాధాకృష్ణ మృతిచెందగా, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎస్టీ కాలనీలో ఆర్టీసీ ఉద్యోగి ఉప్పల మురళి గుండెపోటుతో కన్నుమూయగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాలాజీ అపార్ట్‌మెంట్‌లో మాతృవియోగం పొందిన టీడీపీ నేత సూరపనేని రవిని పరామర్శించారు. బొందలపాటి సుబ్రహ్మణ్యం మృతి చెందగా భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వైఎస్ఎంపీపీ మోర్ల రాంబాబు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ, సొసైటీ ఛైర్‌పర్సన్ బొందలపాటి వీరబాబు, నేతలు షేక్ నబీషోరి, రావి చిట్టి, షేక్ సిలార్, రావి రాజు, కోట సత్యనారాయణ, ఉరిమి మణికాంత్, అల్లంశెట్టి మాణిక్యాలరావు, అడపా రవి తదితరులున్నారు.

అవనిగడ్డ రూరల్ : అశ్వారావుపాలెంలో మాజీ సర్పంచ్ కొండవీటి మధు ను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న మధును పరామర్శించి ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సర్పంచ్ పండ్రాజు నాగ వెంకట లంకమ్మ ప్రసాద్, మాజీ సర్పంచ్ కొండవీటి మస్తాన్‌రావు, ఉపసర్పంచ్ యక్కటి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి ఉదయలక్ష్మీ, వార్డుసభ్యులు కొండవీటి పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంజక్షన్ వికటించి బాలిక మృతి

మచిలీపట్నం క్రైమ్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంజక్షన్ వికటించి బాలిక మృతి చెందిన ఘటన విషాదాన్ని నింపింది. కూచిపూడికి చెందిన అబేద కుమార్తె ఫాతిమా(3)ను రాజుపేటలో తాతమామ్మ పెంచుకుంటున్నారు. జ్వరంతో బాధపడుతున్న ఫాతిమాను రామానాయుడుపేటలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. సోమవారం డాక్టర్ ఇంజక్షన్ చేసిన కొద్దిసేపటికే బాలిక మృతి చెందటంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీ రయ్యారు. ఫాతిమ మృతికి హస్పటల్ యాజమాన్యం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

స్మార్ట్ కార్డుల స్కానింగ్‌పై అవగాహన

పెడన రూరల్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి) : రేషన్ డిపోల ద్వారా ప్రజలకు వేగవంతంగా సరుకులు అందజేసేందుకు డీలర్లకు ఆధునిక ఈ పోస్ యంత్రాలను అందజేస్తున్నట్లు తహసీల్దార్ కె అనిల్ కుమార్ తెలిపారు. పట్టణ, మండల పరిధిలోని 47 రేషన్ దుకాణాల ద్వారా ఆధునిక ఈ పోస్ యంత్రాల ద్వారా స్మార్ట్ కార్డులు స్కాన్ చేసి సరుకులు అందజేయడం జరుగుతుందన్నారు. ఆర్ఐ విజయలక్ష్మి, వీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

బంటుమిల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : పేద బడుగు, బలహీన వర్గాల ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మం డల పార్టీ అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. నియోజకవర్గంలో 78 మందికి 46,66,830 రూపాయల చెక్కులను అందజేశామ న్నారు. ఎండి నూర్, కూనసాని చిన్నా, ఒడుగు తులసీరావు, రేవు గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. **గూడూరు** : మండలంలో రూ. 8,54,398 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను సోమవారం 15 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అందజేశారు. పోతన స్వామి, దాసరి ఉమాసాయిరాం, కోలపల్లి రజని, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

బంటుమిల్లి ఎంపీడీవోగా శైలజా కుమారి

బంటుమిల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): బంటుమిల్లి ఎంపీడీవోగా శైలజా కుమారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం బంటుమిల్లి మండల ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న శైలజాకుమారిని ఎంపీడీవో నియమించారు.